సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:359
Vol-01 ::: Issue-359

హైదరాబాద్ 29 జూలై 2026, బుధవారం
Hyderabad 29 July 2026, Wednesday

పేజీలు: 8, వెల: రూ. 5/-
Pages: 8, Rs. 5/-

స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

...::: పూర్తి కథనం 7వ పేజీలో...

సూర్యుడిలో వీడిన 'వెండి' గుట్టు



సౌర కుటుంబానికి కేంద్రమైన సూర్యుడిలో 'దాగుడుమూతలు' ఆడుతున్న వెండి మిస్టరీకి ఎట్టకేలకు తెరపడింది. ఇన్నాళ్లూ భావిస్తున్నట్లుగా భానుడిలో వెండి పరిమాణం తక్కువగా ఏమీ లేదని, కాంతి ప్రవర్తనలో ఉన్న సంక్లిష్ట భౌతిక ప్రభావాల (నాన్-ఈక్విలిబ్రియం ఎఫెక్ట్స్) వల్లే అది మన కంటికి కనిపించకుండా దాక్కుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బెల్జియంలోని లీజ్ యూనివర్సిటీ పరిశోధకురాలు సేమా కాలిస్కాన్ నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం ఈ వివరాలను వెల్లడించింది.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

హైడ్రాను మరింత బలోపేతం చేస్తాం

హైకోర్టు ఆదేశాలు సమీక్షిస్తాం | కబ్జాదారులపై చర్యలు ఆగవు | ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పదోవ పట్టిస్తున్నారు

హైడ్రాపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉంది: సీఎం రేవంత్ రెడ్డి

హైడ్రా కమిషనర్ అంశంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కోర్టు ఆదేశాలను క్షుణ్ణంగా సమీక్షిస్తామని, హైడ్రా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కీలక సంస్కరణ అని పేర్కొంటూ దానిని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. కబ్జాదారులు నకిలీ పత్రాలతో కోర్టులను తప్పదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తూ, ఆక్రమణలపై చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

...::: పూర్తికథనం 5వ పేజీలో...

లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో డీఎస్సీ పేపర్ లీకేజీ, స్పోర్ట్స్ కోటా పేరిట జరిగిన అక్రమాలపై వైసీపీ విద్యార్థి, యువజన విభాగాలు తలపెట్టిన నిరసన ర్యాలీలు ఘన విజయం సాధించడంపై పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. అన్ని జిల్లాల్లోనూ అభ్యర్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్న నిరసన ప్రదర్శనలకు సంబంధించిన వీడియోను మంగళవారం ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

జపాన్‌లో 7.1 తీవ్రతతో భారీ భూకంపం

జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం భారీ భూకంపం వణికించింది. క్యూషులోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించినట్లు జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

మైనర్లు,నేర చరిత్ర లేనివారిని విడుదల చేయండి

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

నీట్‌యూజీ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల నిర్వహణలో అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సాగిన విద్యార్థుల ఆందోళనల వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. నిరసనల సందర్భంగా వివిధ కేసుల్లో అరెస్టయిన వారిలో 18 ఏళ్ల లోపు ఉన్న మైనర్లు, తీవ్రమైన నేరాభియోగాలు లేదా నేర చరిత్ర లేని విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించింది.

...::: తరువాయి 2వ పేజీలో...



సైబర్ నేరాలకు మరణ శిక్ష

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఆన్‌లైన్ స్కామ్‌లు, సైబర్ నేరాల నెట్‌వర్క్‌లపై మయన్మార్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వీటిని అరికట్టేందుకు పార్లమెంట్‌లో ఒక కఠినమైన 'యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'ను ఆమోదించింది. కొత్త నిబంధనల ప్రకారం.. సైబర్ స్కామ్ కేంద్రాల్లో ప్రజలను అక్రమంగా బంధించినా...

...::: తరువాయి 3వ పేజీలో...

దేశంలోనే తొలి 'ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ' సెంటర్

- అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం 'ఆస్ట్రాజెనెకా' కీలక ఎంఓయూ
- స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలతో 'జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్' ఏర్పాటు
- క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి అధునాతన చికిత్స అందించడమే లక్ష్యం
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు

అమరావతి (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు, బాధితులకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఏపీ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా 'ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ' పరిశోధనలు, ఉచిత సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అంతర్జాతీయ బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ దిగ్గజం 'ఆస్ట్రాజెనెకా ఇండియా' రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

...::: తరువాయి 2వ పేజీలో...

పీఓకేలో కాల్పులు... ఇరవై మంది మృతి

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో ముజఫరాబాద్‌కు చేపట్టిన 'లాంగ్ మార్చ్'కు ముందు పలుచోట్ల చెలరేగిన నిరసనలు తీవ్ర హింసాత్మకంగా రూపాంతరం చెందాయి. స్థానిక భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య చోటుచేసుకున్న ఎదురెదురు ఘర్షణల్లో ఇరవై మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

...::: పూర్తి కథనం 3వ పేజీలో...

YSRCP విద్యార్థి యువజన విభాగం రాష్ట్రం
నైతిక బాధ్యత వహించి లోకేష్ రాజీనామా చేయాలి
నైతిక బాధ్యత వహించి లోకేష్ రాజీనామా చేయాలి
నైతిక బాధ్యత వహించి లోకేష్ రాజీనామా చేయాలి
YSRCP విద్యార్థి యువజన విభాగం రాష్ట్రం
నైతిక బాధ్యత వహించి లోకేష్ రాజీనామా చేయాలి
నైతిక బాధ్యత వహించి లోకేష్ రాజీనామా చేయాలి
YSRCP విద్యార్థి యువజన విభాగం రాష్ట్రం

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
29.07.2026
www.manasarkar.com

నీట్ పేపర్ లీక్ కేసు.. సీబీఐ ఛార్జిషీట్ దాఖలు

న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్)

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ కీలక అడుగు వేసింది. లీకేజీ బాధ్యులకు త్వరితగతిన కఠినశిక్ష పడేలా చూసేందుకు ఏర్పాటైన ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులో తాజాగా తొలి ఛార్జిషీట్‌ను సమర్పించింది. ఈ కేసు విచారణలో భాగంగా 360 మంది సాక్షులు, 422 పత్రాలు, 43 భౌతిక సాక్ష్యాలను ఛార్జిషీట్‌లో సమగ్రంగా పొందుపరిచినట్లు సీబీఐ ప్రతినిధి వెల్లడించారు. ఇందులో ప్రస్తావించిన 13 మంది నిందితులు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారని, ఈ అభియోగపత్రాన్ని కోర్టు బుధవారం విచారణకు స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఏడాది మే 3న జరిగిన ఈ పరీక్షలో ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆ పరీక్షను రద్దు చేసి, గత నెల 21న తిరిగి నిర్వహించిన విషయం విదితమే.

ఏపీ సర్కార్‌పై సమరభేరి

మొదటిపేజీ తరువాయి...

నెల్లూరు జిల్లాలో పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిల నాయకత్వంలో వేలాదిమంది విద్యార్థులతో వీఆర్సీ సెంటర్ కిక్కిరిసిపోయింది. తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వద్ద మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో ర్యాలీ సాగగా, ప్రత్యేకించి స్పోర్ట్స్ కోటాలో భారీ అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. అనంతపురంలో మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల నేతృత్వంలో జీజీహెచ్ నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి భారీ మానవహారం చేపట్టారు. విజయవాడలో సాంబమూర్తి నగర్ నుంచి ధర్నా చౌక్ వరకు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు తదితరుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. అలాగే కర్నూలులో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బుట్టా ప్రతుల్, అన్నమయ్య జిల్లాలో గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడపలో రవీంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషా, ఎమ్మెల్యే దాసరి సుధల ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ వరకు భారీ ర్యాలీలు నిర్వహించి సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాలైన కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం, ఒంగోలు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లోనూ మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్‌నాథ్, పాముల పుష్ప శ్రీవాణి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కలెక్టరేట్లు, ప్రముఖ కూడళ్ల వైపు ప్రదర్శనలు సాగాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న వైసీపీ నేతలను, విద్యార్థి నాయకులను పోలీసులు పలుచోట్ల ముందస్తుగా అదుపులోకి తీసుకోవడంపై పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపట్లలో మాజీ సభాపతి కోన రఘుపతి పీఏ సహా పలువురు నాయకులను స్టేషన్‌కే పరిమితం చేయడాన్ని, మీడియా కవరేజీపై ఆంక్షలు విధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని, డీఎస్సీ బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని వైసీపీ శ్రేణులు స్పష్టం చేశాయి.

విద్యార్థులు పోరాడుతుంటే మోదీ రీల్స్ చూస్తున్నారు

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు.. ఇవన్నీ కంటితుడుపు చర్యలే: గౌరవ్ గొగోయ్
"దేశవ్యాప్తంగా విద్యాభవిష్యత్తు కోసం విద్యార్థులు పోరాటం చేస్తుంటే, ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం సమస్యను పక్కనపెట్టి ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసుకుంటూ కూర్చున్నారు," అని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ఘాటుగా విమర్శించారు. 2024లో తీసుకొచ్చిన చట్టమే కఠినంగా ఉంటే, మళ్లీ పేపర్ లీకేజీలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. ప్రవేశపెట్టిన సవరణలను పరిశీలిస్తే వ్యవస్థలో అర్థవంతమైన మార్పులు తీసుకురావాలని ప్రభుత్వానికి లేదని, ఇవన్నీ కేవలం కంటితుడుపు చర్యలేనని ఆరోపించారు. 2024 నీట్ లీకేజీ సమయంలో అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అసలు లీకేజీయే జరగలేదని నిజాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, అలాంటి వ్యక్తికి సభలో బీజేపీ నేతలు స్వాగతం పలకడం విచారకరమన్నారు. నిరసన తెలిపిన విద్యార్థుల తలలపై లాఠీలతో కొట్టాలని పోలీసులకు ఎవరు ఆదేశాలిచ్చారని నిలదీశారు.

విద్యా హక్కులను దోచుకుంటున్నారు: అఖిలేశ్ యాదవ్

"ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ నుంచి తొలగించి, ప్రధాని మోదీని కాపాడేందుకు బీజేపీ ప్రయత్నించింది" అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. పేపర్ లీకేజీలపై ప్రభుత్వం దిగివచ్చేలా పోరాడిన యువతకు అభినందనలు తెలిపారు. దేవాలయాల విరాళాలను దొంగిలించేవారు ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టలేరని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, దేశంలోని వెనుకబడిన వర్గాల విద్యార్థుల హక్కులను దోచుకుంటోందని ఆరోపించారు.

2014కి ముందు 22 సార్లు లీక్‌లు అయ్యాయి: బన్సూరీ స్వరాజ్

విపక్షాల విమర్శలపై బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ తీవ్రంగా స్పందించారు. గతంలో యూపీఏ పాలనలో, 2014కి ముందు దేశంలో ఏకంగా 22 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని సభ దృష్టికి తెచ్చారు. "నాడు వరుసగా పేపర్ లీకేజీలు జరిగినప్పుడు ఇప్పుడు రాజీనామాలు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఎవరైనా రాజీనామా చేశారా?" అని కౌంటర్ ఇచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు పూర్తి భరోసానిస్తూ కఠిన చట్టాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు.

ధర్మేంద్ర ప్రధాన్ పై వస్తున్న వార్తలు అబద్ధం

మొదటిపేజీ తరువాయి...

ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ నుంచి మరో మంత్రిత్వ శాఖకు మార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని, అయితే ఆ ప్రతిపాదనను 'కాక్రోచ్ జనతా పార్టీ' తిరస్కరించడం వల్లే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చిందంటూ ఇటీవల విపరీతంగా ప్రచారం జరిగింది. ఈ వార్తలను బీజేపీ ఖండించింది. న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ లో మీడియాతో మాట్లాడిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఈ ప్రచారాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర పూరిత ప్రయత్నమే ఇది. ధర్మేంద్ర ప్రధాన్ మంత్రిత్వ శాఖను మారుస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. ఇవన్నీ కేవలం సంచలనం కోసమే సృష్టించిన నిరాధార కథనాలు. ఇటువంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దు," అని సంబిత్ పాత్ర విజ్ఞప్తి చేశారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్)

పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో పాకిస్తాన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న శాసనసభ ఎన్నికల ప్రక్రియపై భారత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఆ ప్రాంతంలో తాము సాగిస్తున్న ఆక్రమణలను, తీవ్రస్థాయిలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను ప్రపంచ దృష్టి నుంచి మరల్చేందుకు పాకిస్తాన్ ఆడుతున్న కపట నాటకాల్లో ఈ ఎన్నికలు భాగమని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్‌వాల్ స్పందిస్తూ దాయాది దేశం తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పీవోకేలో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నాయనే వార్తలను మనం చూస్తున్నాం. పాక్ అక్రమ ఆక్రమణలో ఉన్న ఆ ప్రాంతాలు ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని మేము స్పష్టం చేస్తున్నాం. అక్కడ ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల తతంగం అనేది వారి చట్టవిరుద్ధ ఆక్రమణలను కప్పిపుచ్చుకోవడానికే.

తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు, ఘోరాలను బయటి ప్రపంచానికి తెలియకుండా చేసేందుకు పాక్ ప్రయత్నిస్తోంది," అని రణ్‌ధీర్ జయస్‌వాల్ మండిపడ్డారు. పాక్ సాగిస్తున్న తీవ్రమైన ఆర్థిక దోపిడీ, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయడం, అణచివేత ధోరణుల ఫలితంగానే ఇటీవల అక్కడ ప్రజల నుంచి భారీ ఎత్తున ఆందోళనలు వెల్లువెత్తాయని ఆయన పేర్కొన్నారు. పీవోకేలోని మొత్తం 45 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు పాకిస్తాన్ చర్యలు చేపట్టింది. జులై 27న జరిగిన తొలి విడత పోలింగ్‌లో 13 స్థానాలకు పోలింగ్ నిర్వహించగా.. అందులో 'పాకిస్తాన్ ముస్లిం లీగ్‌నవాజ్' 9 స్థానాల్లో, 'పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ' 4 స్థానాల్లో విజయం సాధించినట్లు అక్కడి ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని 'పీటీఐ' ఈ ఎన్నికలను బహిష్కరించి దూరంగా ఉంది. అయితే, తొలి దశ పోలింగ్ సందర్భంగా పెద్ద ఎత్తున రిగ్గింగ్, అక్రమాలు జరిగాయంటూ స్థానిక పౌరులు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

'ఎస్ఐఆర్'తో 24 ఏళ్ల తర్వాత అమ్మ ఒడికి...

ముంబయి(ఏడీఎన్ఎన్)

గారాబంగా పెంచుకున్న కంటిపాప పాతికేళ్ల క్రితం దూరమైతే ఆ తల్లి పడిన పేగుబంధం ఆవేదన వర్ణనాతీతం. ఎంతకాలం గడిచినా తన కొడుకు తిరిగి రాకపోతాడా అని ఆశగా ఎదురుచూస్తున్న ఆ తల్లి కలను ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియ కలిపింది. 24 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి, అధికారుల రికార్డుల్లో 'మరణించిన ట్లు' నమోదైన తనయుడు బతికే ఉన్నాడని తెలిసి ఆ తల్లి పొందిన ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మహారాష్ట్రలో చోటుచేసుకున్న ఈ వినూత్న సంఘటన అక్కడి ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

జాడలేని కొడుకు . ఆశ చావని తల్లి

సోలాపూర్ జిల్లా కర్మాళా తాలుకాలోని కేడ్‌గావ్‌కు చెందిన నవనాథ్ ధోండియా అనే వ్యక్తి 24 ఏళ్ల క్రితం ఇంటి నుంచి అనుకోకుండా వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. అయినప్పటికీ అతడి తల్లి రంజనా తన కొడుకు ఏదో ఒక రోజు వెతుక్కుంటూ వస్తాడనే నమ్మకంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తోంది. నవనాథ్ ఇంటి నుంచి వెళ్లాక బుల్దానా జిల్లాలోని మల్కాపూర్‌లో స్థిరపడి, వివాహం చేసుకుని కుటుంబంతో జీవిస్తున్నాడు.

'ఎస్ఐఆర్'తో వీడిన గుట్టు

ఇటీవల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మల్కాపూర్ బూత్ లెవల్ ఆఫీసర్లు నీతా భోంబే, అనిల్ భోంబేలు ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో నవనాథ్ వివరాలను తనిఖీ చేయగా, అతను సోలాపూర్ జిల్లాకు చెందినవాడిగా గుర్తించి అక్కడి బీఎల్ఓ విఠల్ తుకారాంను సంప్రదించారు. సోలాపూర్ రికార్డుల్లో నవనాథ్ మరణించినట్లుగా నమోదు కావడం చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. నవనాథ్ బతికే ఉన్నాడని, మల్కాపూర్‌లో ఉంటున్నాడని స్పష్టం కావడంతో వెంటనే అతని కుటుంబానికి సమాచారం అందించారు.

ఆనందంతో ఆత్మీయ ఆలింగనం

కొడుకు బతికే ఉన్నాడని తెలిసిన క్షణమే తల్లి రంజనా, నవనాథ్ సోదరుడు కలిసి వెంటనే మల్కాపూర్ పయనమయ్యారు. 24 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కళ్లముందు నిలిచిన కడుపుకోతను చూసి ఆ తల్లి గుండె ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఇన్నేళ్ల తర్వాత ఒకరినొకరు కౌగిలించుకుని కన్నీళ్లు పెట్టుకున్న ఆ దృశ్యం చూసి స్థానికులు, అధికారులు భావోద్వేగానికి గురయ్యారు. ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ ఒక కుటుంబంలో సరికొత్త వెలుగులు నింపింది.

మైనర్లు,నేర చరిత్ర లేనివారిని విడుదల చేయండి

మొదటిపేజీ తరువాయి...

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఈ పిటిషన్లపై సమగ్ర విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. ఢిల్లీతో పాటు పలు ప్రాంతాల్లో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు తీవ్ర స్థాయిలో లాఠీఛార్జి చేయడం, బాష్పవాయువు గోళాలను ప్రయోగించడంపై దాఖలైన పిటిషన్లను ధర్మాసనం పరిశీలించింది. నిరసనల సమయంలో పోలీసుల చర్యల కారణంగా విద్యార్థినులు, మహిళలు, న్యాయవాదులు,మీడియా ప్రతినిధులు గాయపడటంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలపై పారదర్శకమైన, స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం.. ఇందుకోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఢిల్లీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్‌లపై విచారణ కొనసాగించవచ్చని, అయితే విద్యార్థులపై ఎలాంటి తొందరపాటు లేదా కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కుకు ప్రాధాన్యమిస్తూ, నిరసనల నిర్వహణ,పోలీసుల చర్యలకు సంబంధించి ఏకరూప మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది. చట్టాన్ని ఎవరైనా చేతుల్లోకి తీసుకుని ఉల్లంఘిస్తే విచారించి శిక్షించాల్సిందేనని, అదే సమయంలో 250 మంది పోలీసులపై జరిగిన దాడిలో పాల్గొన్నది విద్యార్థులా లేదా ఇతర నేర మూలకాల అనేది తేలాల్సి ఉందన్నారు. ఈ కేసు విచారణకు సంబంధించి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆందోళనలకు సంబంధించిన అన్ని రకాల సీసీటీవీ ఫుటేజ్‌లు,డిజిటల్ సాక్ష్యాలను సురక్షితంగా భద్రపరచాలని ఆదేశించింది. అయితే, ఈ డిజిటల్ డేటాను పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకురాకూడదని స్పష్టమైన నిబంధన విధించింది.

పెళ్లి కావడం లేదని 29 మంది ఆత్మహత్య

ముంబయి (ఏడీఎన్ఎన్)

యుక్త వయస్సు రాగానే పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారు. కానీ నేటి సమాజంలో వివాహం కాకపోవడం కొందరి పాలిట తీవ్ర మానసిక భారంగా మారుతోంది. పెళ్లి కాలేదనే దిగులుతో మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాలో 29 మంది యువకులు ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర దిగ్భ్రాంతి కలిగిస్తోంది. జలగావ్ జిల్లా పోలీసులు నిర్వహించిన ఒక ప్రత్యేక సర్వేలో ఈ దిగ్భ్రాంతిభరిత విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పోలీసు సర్వేలో షాకింగ్ నిజాలు

జలగావ్ జిల్లా పోలీసుల వివరాల ప్రకారం..ఈ ఏడాది జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య ఆ జిల్లాలో మొత్తం 443 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో 383 మంది పురుషులు, 29 మంది మహిళలు, 8 మంది బాలురు, 11 మంది బాలికలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, చదువుల ఒత్తిడి, ప్రేమ వ్యవహారాల వల్ల వీరంతా ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వీటన్నింటికంటే ఘోరమైన విషయమేమిటంటే.. పెళ్లి కావడం లేదనే తీవ్ర నిరాశా నిస్పృహలతో 29 మంది యువకులు ప్రాణాలు తీసుకున్నారు. వయసు మళ్లిపోతుండటం, సరైన భాగస్వామి దొరక్కపోవడం, సమాజం నుంచి వచ్చే చులకన చూపు, ఒంటరితనం వల్ల పెరిగిన మానసిక ఆందోళనలే పురుషుల్లో ఆత్మహత్యల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాలని డేటా స్పష్టం చేస్తోంది.

బాధ్యత వహించాల్సిన సమాజం

ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 12 మందిపై కేసులు నమోదు కావడం గమనార్హం. పెళ్లి, చదువు, ఉద్యోగం అనేవి జీవితంలో భాగాలు మాత్రమే తప్ప.. అవే పూర్తి జీవితం కాదనే అవగాహన యువతలో కలగాలని సైకియాట్రిస్టులు స్పష్టం చేస్తున్నారు. డిప్రెషన్‌తో బాధపడుతున్న వ్యక్తులతో కుటుంబ సభ్యులు, స్నేహితులు నిరంతరం మాట్లాడుతూ మానసిక మద్దతు అందించాలని సూచిస్తున్నారు. మానసిక సమస్యలను అవమానంగా భావించకుండా, ప్రారంభంలోనే కౌన్సిలింగ్ లేదా వైద్య సహాయం తీసుకుంటే ఎంతోమంది అమాయకుల ప్రాణాలను కాపాడవచ్చు. జలగావ్ పోలీసుల లెక్కలు సమాజానికి ఒక తీవ్ర హెచ్చరిక అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జోషి రేపిస్టుల మద్దతుదారు

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్)

కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పలు ఆరోపణలు చేశారు. ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారుడని, అలాంటి వ్యక్తికి దేశ విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం అత్యంత దారుణమని రాహుల్ విమర్శించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను జోషి సమర్థించారని, అలాంటి నైతికత లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండేందుకు ఎంతమాత్రం అర్హుడు కాదని ఆయన స్పష్టం చేశారు.

ప్రధాని నిర్ణయం పెద్ద వింత

విద్యావ్యవస్థలోని లోపాలు, పేపర్ లీకేజీలపై ప్రశ్నిస్తూ వీధుల్లోకి వచ్చిన విద్యార్థులను చిత్రహింసలకు గురి చేశారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. కేబినెట్‌లో ఎంతో మంది ఉన్నప్పటికీ అత్యాచార దోషులను కాపాడే వ్యక్తినే ప్రధాని విద్యాశాఖకు ఎంచుకోవడం వింతగా ఉందన్నారు. ఒకవైపు మహిళా సాధికారత గురించి మాట్లాడుతూ, మరోవైపు ఇలాంటి వారికి మంత్రి పదవులు ఇవ్వడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతుందని ఆరోపించారు.

వేధింపులు ఆపకపోతే మళ్లీ ఆందోళనకు దిగుతాం

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్)

దేశరాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన భారీ నిరసనల తర్వాత , విద్యార్థులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు,పోలీసు వేధింపులపై సీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. విద్యార్థులను వేధించడం వెంటనే ఆపకపోతే మళ్లీ శాంతియుత మార్గంలో భారీ ఆందోళనకు దిగుతామని పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. "విద్యార్థులను పోలీసులు వేధించడం ఇలాగే కొనసాగితే సీజేపీ త్వరలోనే మరో భారీ శాంతియుత నిరసన ద్వారా సమాధానం చెప్తుంది. ప్రభుత్వం వెంటనే విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం, వేధింపుల వేటను ఆపాలి" అని అభిజీత్ దీప్కే సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. మరోవైపు తమ పోరాటం ఇంకా పూర్తికాలేదని పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఆందోళన తాత్కాలికంగా విరమించడం అంటే ఉద్యమం ముగిసినట్లు కాదని, సీజేపీ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత నిరసన ముగింపు కేవలం ఒక ఆరంభం మాత్రమేనని అభిజీత్ దిప్కే అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధి సౌరవ్ దాస్ మంగళవారం విమర్శలు గుప్పించారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు కొనసాగించవచ్చంటూ కోర్టు తెలిపిన అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సాకుగా వాడుకునే ప్రమాదం ఉందన్నారు. శాంతియుతంగా ఆందోళన చేసిన విద్యార్థులపై నమోదైన కేసులను పూర్తిగా ఎత్తివేయడమే తమ ప్రధాన డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. అస్సాం, బిహార్ వంటి ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని గౌరవిస్తూ తక్షణమే ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. జూలై 25న కేంద్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీ ప్రకారం నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోమని చెప్పిందని, అయితే కోర్టులో కేంద్ర ప్రభుత్వ వాదనలు దానికి విరుద్ధంగా ఉండటంపై సౌరవ్ దాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం ఇచ్చిన హామీ ఆధారంగానే తాము నిరసనను విరమించుకున్నామని, కేసులు వెనక్కి తీసుకోకపోతే మళ్లీ ఆందోళన బాట పట్టక తప్పదని ఆయన స్పష్టం చేశారు.

హైడ్రా రేవంత్ రెడ్డికి వేట కుక్కలా మారింది

న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్)

'హైడ్రా' చీఫ్‌గా రంగనాథ్‌ను తక్షణమే తప్పించాలంటూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని, హైడ్రా తొమ్మిది తలల విషనాగు అని ధర్మాసనం చెప్పినట్లుగా సెటైర్లు వేశారు. సీఎం ఆ సంస్థను పక్కా బ్లాక్‌మెయిల్ టూల్‌గా వాడుతున్నారని, హైడ్రాను అడ్డుపెట్టుకుని దందాలు చేసి వచ్చిన డబ్బులను రాహుల్ గాంధీకి, బీజేపీ అధిష్టానానికి సంచుల్లో నింపి పంపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని బీజేపీ నేతలు కూడా అందుకు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో ఏ అధికారైనా ఏకంగా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన చరిత్ర ఎక్కడైనా ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేట కుక్కలా మారిందని మండిపడుతూ, బిల్డర్ల దగ్గర ఆర్ఆర్ టాక్స్ వసూలు చేస్తున్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. హైడ్రా మంచి పనులే చేస్తుంటే.. రేవంత్ రెడ్డి సోదరుడి ఇల్లు, కాంగ్రెస్ నేతలు పొంగులేటి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీ ఫామ్‌హౌసులు ఎందుకు కూలగొట్టడం లేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో పారేస్తామని ప్రజలకు స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ ఇష్యూలో మోడీ ప్రభుత్వంపై యువత తొలిసారి తిరగబడిందని, దేశంలో జెన్‌జీ ఉద్యమం జరుగుతోందని తెలిపారు. యాంటీ పేపర్ లీక్ బిల్లును తమ పార్టీ స్వచ్ఛందంగా సమర్థిస్తుందని, ప్రధాని మోదీ ప్రకటించిన 'నందన్ నిలేకని కమిటీ'ని స్వాగతిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

మొదటిపేజీ తరువాయి...

చంద్రబాబు ప్రభుత్వం తమకు చేసిన అన్యాయంపై ఈరోజు యువత, 'GenZ' ఎంతటి ఆగ్రహావేశాలతో ఉందో రాష్ట్రం మొత్తం ప్రత్యక్షంగా చూసిందన్నారు. విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో చేపట్టిన ర్యాలీలు అత్యంత విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ వరకు జరిగిన ప్రతి అక్రమంపైనా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని అభ్యర్థులు గట్టిగా గొంతెత్తారని జగన్ తెలిపారు. తమ స్వయంకృషితో, ప్రతిభతో ఉద్యోగాలు సాధించాల్సిన నిరుద్యోగ యువతను రోడ్లెక్కించిన పాపం ఖచ్చితంగా చంద్రబాబు ప్రభుత్వానిదేనని ధ్వజమెత్తారు. రాత్రింబవళ్లు శ్రమించి టీచర్ ఉద్యోగం కోసం సిద్ధపడిన నిరుద్యోగులకు న్యాయం చేయాల్సింది పోయి, లీకులు, అక్రమాలతో వారి జీవితాలను, భవిష్యత్తును ప్రభుత్వం కాలరాసిందని మండిపడ్డారు. డీఎస్సీ అక్రమాలకు సంబంధించి స్పష్

పీఓకేలో కాల్పులు .. ఇరవై మంది మృతి

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో ముజఫరాబాద్‌కు చేపట్టిన 'లాంగ్ మార్చ్'కు ముందు సోమవారం పలుచోట్ల చెలరేగిన నిరసనలు తీవ్ర హింసాత్మకంగా రూపాంతరం చెందాయి. స్థానిక భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య చోటుచేసుకున్న ఎదురెదురు ఘర్షణల్లో ఇరవై మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. రావల్‌కోట్, చాంద్‌నీ చౌక్, ఖస్సాయి గలి, బల్దియా అడ్డా తదితర ప్రాంతాల్లో నిరసనకారులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించడంతో పాటు గాల్లోకి కాల్పులు జరిపాయి. ఆందోళనకారులు ప్రత్యామ్నాయ మార్గాల గుండా రావల్‌కోట్‌లోకి ప్రవేశించేందుకు యత్నించడంతో రెండు వర్గాల మధ్య మళ్లీ తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రధాన రహదారులను మూసివేసి, భారీగా బలగాలను మోహరించడం ద్వారా తమ శాంతియుత లాంగ్ మార్చ్ ను ప్రభుత్వం బలవంతంగా అడ్డుకుందని అవామీ యాక్షన్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక చట్టసభలో శరణార్థుల కోసం కేటాయించిన 12 సీట్లను తక్షణమే రద్దు చేయాలనే ప్రతిపాదనతో పాటు వివిధ ఆర్థిక, రాజకీయ డిమాండ్లతో కొంతకాలంగా జేఏఏసీ అక్కడ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తోంది. ప్రభుత్వం దమనకాండకు దిగినా తమ పోరాటాన్ని ఆపేది లేదని ఆందోళనకారులు స్పష్టం చేయడంతో పీఓకేలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

అమెరికా దౌత్యవేత్త వాకౌట్

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా అమెరికా, దాని అత్యంత సన్నిహిత ఐరోపా మిత్రదేశమైన ఫ్రాన్స్ మధ్య తీవ్ర విభేదాలు భగ్గుమన్నాయి. ట్రంప్ పరిపాలనలోని మానవ హక్కుల రికార్డుపై ఫ్రాన్స్ దౌత్యవేత్త ఘాటు విమర్శలు చేయడంతో అమెరికా దౌత్యవేత్త సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మధ్య పెరుగుతున్న వైరాన్ని ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల అధిపతి వోల్కర్ టర్క్ కు మరో నాలుగేళ్ల పదవీకాలాన్ని అమెరికా వ్యతిరేకించింది. అయితే జెనీవాలో జరిగిన జనరల్ అసెంబ్లీ ఓటింగ్‌లో ఫ్రాన్స్ సహా పలు దేశాలు టర్కీకి పూర్తి మద్దతు పలికాయి. ఈ సందర్భంగా జెనీవాలోని ఫ్రాన్స్ మిషన్ స్పందిస్తూ.. "ఒకప్పుడు అమెరికా మానవ హక్కులకు ఆదర్శంగా ఉండేది, కానీ ఇప్పుడు రష్యా, ఉత్తర కొరియాల సరసన ఏకాకిగా నిలిచింది" అంటూ ఘాటుగా ట్వీట్ చేసింది. ఈ విమర్శల నేపథ్యంలో యూఎన్ఎస్‌సి సమావేశంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా డిప్యూటీ అంబాసిడర్ డాన్ నెగ్రియా.. ఫ్రాన్స్ పై విమర్శలు గుప్పిస్తూ బయటకు వెళ్లిపోయారు.

సింధు జలాల ఒప్పందంపై ఉక్కుపాదం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ప్రోత్సాహిస్తున్న పాకిస్తాన్‌కు భారత్ కోలుకోలేని షాక్ ఇచ్చింది. 'రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు' అనే దృఢమైన సంకల్పంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం పాక్ ఆర్థిక నడ్డి విరిచింది. ఈ చర్యపై అంతర్జాతీయ వేదికలపై పాకిస్తాన్ ఆరోపణలు గుప్పిస్తున్నప్పటికీ.. ఉగ్రవాద మూలాలను మట్టుబెట్టేవరకు వెనక్కి తగ్గేది లేదని న్యూఢిల్లీ స్పష్టం చేసింది.

దెబ్బతిన్న పాక్ ఆర్థిక వ్యవస్థ

గతేడాది ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్ తన సహనాన్ని కోల్పోయి ఈ నిర్ణయాత్మక చర్య తీసుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేయడమే కాకుండా, నదీ ప్రవాహాలకు సంబంధించిన సమాచార మార్పిడిని భారత్ పూర్తిగా నిలిపివేసింది. అలాగే కొత్త ఆనకట్టల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. ఈ ఒప్పందం కింద లభించే 80 శాతం నీటిపైనే పాకిస్తాన్ వ్యవసాయం, ఆహార భద్రత, జీడీపీలో నాల్గో వంతు, మూడో వంతు ఉపాధి ఆధారపడి ఉన్నాయి. భారత్ తీసుకున్న సైనికేతర చర్యతో పాకిస్తాన్‌కు దీర్ఘకాలిక ఆర్థిక విఘాతం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది.

పునరుద్ధరించే ప్రసక్తే లేదు

ఈ ఒప్పందాన్ని ఎప్పటికీ పునరుద్ధరించబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేయగా.. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ సంపూర్ణంగా విడనాడితేనే ఒప్పందంపై ఆలోచన ఉంటుందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. సింధు జలాల రద్దు అనేది ఏదో తాత్కాలిక చర్య కాదని, పాక్ ఉగ్ర వైఖరికి చెక్ పెట్టే దీర్ఘకాలిక విధాన సాధనమని భారత అగ్రనేతల వ్యాఖ్యలతో స్పష్టమవుతోంది. ఉగ్రవాదంపై సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులతో పాటు ఈ నీటి దౌత్యం పాకిస్తాన్‌ను కోలుకోలేని దెబ్బతీసింది.

మళ్లీ కరోనా.. చైనాలో 79 వేల కేసులు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

చైనాలో మరోసారి కోవిడ్ 19 కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాదిలో తొలిసారిగా ఇన్‌ఫ్లుయెంజాను దాటేసి అత్యంత వేగంగా వ్యాపిస్తున్న శ్వాసకోశ వ్యాధిగా కరోనా నమోదైంది. గత నెలలో చైనా వ్యాప్తంగా 79 వేల కొత్త కేసులు నమోదు అయ్యాయి. ఈ నెల జూలై నాటికి పాజిటివిటీ రేటు 16.3 శాతానికి పెరిగింది. అక్కడ ఒమిక్రాన్‌కు చెందిన 'NB.1.8.1' వేరియంట్ ప్రధానంగా వ్యాపిస్తున్నట్లు చైనా వ్యాధి నియంత్రణ సంస్థ వెల్లడించింది. బాధితుల్లో ఎక్కువ మందికి స్వల్ప లక్షణాలే ఉన్నాయని, గత వేవ్‌లతో పోలిస్తే ప్రమాద తీవ్రత తక్కువగానే ఉందని స్పష్టం చేసింది. తీవ్రమైన ఎండల వల్ల ఏసీ గదుల్లో ఎక్కువసేపు గడపడం, వేసవి ప్రయాణాలు పెరగడమే ఈ ఉధృతికి కారణమని నిపుణులు పేర్కొన్నారు. చైనా పరిణామాల నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తమైంది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా కొన్ని చోట్ల నమోదైన కేసులు సాధారణమైనవేనని కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. పెద్ద ప్రమాద సూచనలేవీ లేకపోయినా, పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిశితంగా పర్యవేక్షిస్తున్నాయి.

కువైట్‌తో పాక్ రక్షణ ఒప్పందం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

గల్ఫ్ ప్రాంతంలో తన సైనిక, దౌత్య ముద్రను విస్తరించే దిశగా పాకిస్తాన్ మరో అడుగు వేసింది. సౌదీ అరేబియాతో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందం తర్వాత.. తాజాగా కువైట్ తో కూడా ఐదేళ్ల రక్షణ సహకార ఒప్పందానికి అధికారిక ఆమోదం పొందింది. కువైట్ ప్రభుత్వం తీసుకువచ్చిన '2026 అమిరీ డిక్రీ నంబర్ 73' ద్వారా ఈ ఒప్పందానికి పూర్తి చట్టబద్ధత లభించింది. వాస్తవానికి 2023 జూన్‌లో రెండు దేశాల మధ్య కుదిరిన ప్రాథమిక అంగీకారానికి ఇప్పుడు తుది రూపు లభించడంతో గల్ఫ్ లో పాకిస్తాన్ సైనిక భాగస్వామ్యం మరింత పటిష్టం కానుంది.

ఒప్పందంలో కీలక అంశాలు

ఈ నూతన ఒప్పందం ప్రకారం పాకిస్తాన్ , కువైట్ సాయుధ దళాలు అనేక రంగాల్లో కలిసి పనిచేయనున్నాయి. ఉమ్మడి సైనిక విన్యాసాలు, సైనిక శిక్షణ, ఉన్నత విద్య, నిఘా సమాచార మార్పిడి, లాజిస్టిక్ సహకారం, రక్షణ పరిశోధనలు, సైనిక సాంకేతికత అభివృద్ధి, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రక్షణ తయారీ రంగంలో భాగస్వామ్యం వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ఉమ్మడి సైనిక కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఐదేళ్ల కాల పరిమితి కలిగిన ఈ ఒప్పందం, ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే ఆటోమేటిక్‌గా పొడిగించబడుతుంది. అయితే 2025లో సౌదీ అరేబియా-పాకిస్తాన్ మధ్య కుదిరిన పరస్పర రక్షణ (ఒక దేశంపై దాడి జరిగితే మరొక దేశం సైన్యంతో కలబడటం) ఒప్పందంలా ఇది లేదు. ఇది కేవలం శిక్షణ, సాంకేతిక, రక్షణ సహకారానికి మాత్రమే పరిమితమైంది.

గల్ఫ్ దేశాలు.. పాక్ వ్యూహం

పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, హౌతీల దాడులు, సముద్ర మార్గాల భద్రతా సవాళ్ల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు తమ భద్రతా భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకున్న పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్.. తన సైన్యాన్ని ప్రాంతీయ భద్రతా భాగస్వామిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సైనిక సలహాదారులు, శిక్షణ పొందిన సిబ్బంది, రక్షణ పరికరాల సరఫరా ద్వారా గల్ఫ్ దేశాల నుంచి ఆర్థిక సహాయం, పెట్టుబడులు, ఇంధన రాయితీలు పొందడమే పాక్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

అప్రమత్తమైన భారత్

ఈ పరిణామం భారత్‌కు తక్షణ భద్రతా ముప్పు కాకపోయినా, న్యూఢిల్లీ దీనిపై నిశితంగా దృష్టి సారించింది. గల్ఫ్ దేశాలతో భారత్‌కు 100 బిలియన్ డాలర్లకు పైగా వ్యాపారం ఉండటమే కాకుండా, అక్కడ 85 లక్షల మందికి పైగా భారతీయులు జీవిస్తున్నారు. ఒక్క కువైట్‌లోనే 10 లక్షల మందికి పైగా భారతీయులు ఉన్నారు. పాకిస్తాన్-కువైట్ సైనిక సహకారం భవిష్యత్తులో నిఘా సమాచార మార్పిడి వరకు విస్తరిస్తే, అది భారత భద్రతా ప్రయోజనాలపై చూపే ప్రభావాన్ని న్యూఢిల్లీ విశ్లేషిస్తోంది. అలాగే అరేబియా సముద్రం, హర్మూజ్ జలసంధి ప్రాంతాల్లో పాక్ నౌకాదళ కదలికలను భారత్ పర్యవేక్షించనుంది. అయితే గల్ఫ్ తో భారత్‌కు ఉన్న బలమైన ఆర్థిక, ఇంధన, సంబంధాల దృష్ట్యా.. కేవలం సైనిక ఒప్పందాల ఆధారంగా పాకిస్తాన్ పెద్ద ఆధిపత్యాన్ని సాధించడం అంత సులభం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

చర్చిద్దామంటేనే దాడులు ఆపాం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ఇరాన్‌పై వైమానిక దాడులను తాత్కాలికంగా నిలిపివేయడానికి కారణం తెహ్రాన్ చేసిన విజ్ఞప్తేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. "దయచేసి దాడులు ఆపండి.. సమావేశమై మాట్లాడుకుందాం" అని ఇరాన్ తమను కోరిందని, అందుకే ప్రస్తుతం దౌత్యపరమైన చర్చలకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఒకవేళ ఈ చర్చలు విఫలమైతే మళ్లీ సైనిక చర్యలు ప్రారంభించడం ఖాయమని ట్రంప్ ఘాటుగా హెచ్చరించారు. శాంతియుత చర్చలకు ఇరాన్ ముందుకు రావడంపై ట్రంప్ స్పందిస్తూ.. "వాళ్లు చాలా మర్యాదగా చర్చలకు ఆహ్వానించారు. ప్రస్తుతం ఇరాన్‌తో మాట్లాడే దశలోనే ఉన్నాం. చర్చలు సానుకూలంగా సాగుతున్నాయి, పరిస్థితులు మంచి దిశగా వెళ్లే అవకాశం ఉంది. అయితే మేం బలహీనంగా ఉన్నామని భావించి వాళ్లు సమావేశం కోరలేదు, మా దాడుల తీవ్రత భరించలేకే దిగొచ్చారు" అని పేర్కొన్నారు. దాదాపు రెండు వారాల పాటు సాగిన అమెరికా ధాటికి తాత్కాలికంగా విరామం ఇచ్చి, దౌత్యపరమైన పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

ఆయుధ నిల్వలపై ఆందోళన

ఈ చర్చలకు ఇరాన్, ఒమన్ నాయకత్వం వహిస్తుండగా.. ఖతార్, పాకిస్తాన్ , ఈజిప్టులతో పాటు ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, సీనియర్ సలహాదారు జారెడ్ కుష్నర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. యుద్ధం మరింత విస్తరించడం వల్ల ఆయుధ నిల్వలు తగ్గిపోతాయని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కేన్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలోని అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ సైతం హర్మూజ్ జలసంధి ప్రాంతంలో దాడులు నిలిపివేయాలని సూచించినట్లు సమాచారం. ఈ అంతర్గత సమీక్షల ప్రభావంతోనే ట్రంప్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కథనాలపై ట్రంప్ స్పందిస్తూ.. అమెరికా వద్ద క్షిపణులు, రక్షణ సామగ్రి సమృద్ధిగా ఉన్నాయని, ముఖ్యంగా పేట్రియాట్ క్షిపణి వ్యవస్థల ఉత్పత్తిని మరింత వేగవంతం చేస్తున్నామని స్పష్టత ఇచ్చారు. గతంలో బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు పెద్దఎత్తున ఆయుధాలు పంపడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా విమర్శించారు.

కొనసాగుతున్న దాడులు

మరోవైపు ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్లు సౌదీ అరేబియా లక్ష్యంగా దాడులు కొనసాగించారు. మంగళవారం తెల్లవారుజామున ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్‌లో అమెరికా కాన్సులేట్ సమీపంలో సహా పలుచోట్ల భారీ పేలుళ్లు సంభవించినట్లు 'అల్ జజీరా' నివేదించింది. సులేమానియాలోని ఖోర్ మోర్ గ్యాస్ క్షేత్రంపై కూడా దాడి జరిగినట్లు స్థానిక మీడియా ధ్రువీకరించింది. పశ్చిమాసియాలో ప్రస్తుతం ఒకవైపు దౌత్య చర్చలు, మరోవైపు ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

సూర్యుడిలో వీడిన 'వెండి' గుట్టు

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)



సౌర కుటుంబానికి కేంద్రమైన సూర్యుడిలో 'దాగుడుమూతలు' ఆడుతున్న వెండి మిస్టరీకి ఎట్టకేలకు తెరపడింది. ఇన్నాళ్లూ భావిస్తున్నట్లుగా భానుడిలో వెండి పరిమాణం తక్కువగా ఏమీ లేదని, కాంతి ప్రవర్తనలో ఉన్న సంక్లిష్ట భౌతిక ప్రభావాల (నాన్‌ఈక్విలిబ్రియం ఎఫెక్ట్స్) వల్లే అది మన కంటికి కనిపించకుండా దాక్కుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బెల్జియంలోని లీజ్ యూనివర్సిటీ పరిశోధకురాలు సేమా కాలిస్కాన్ నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం ఈ వివరాలను వెల్లడించింది. ప్రముఖ సైన్స్ జర్నల్ 'ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్'లో దీనికి సంబంధించిన అధ్యయనం ప్రచురితమైంది.

ఉల్కల లెక్కింపుతో వైరుధ్యం

వాస్తవానికి సూర్యుడిలో 98.5 శాతానికి పైగా హైడ్రోజన్, హీలియం వాయువులే ఉంటాయి. వెండి వంటి భారలోహాలు అత్యంత స్వల్ప పరిమాణంలో ఉన్నప్పటికీ.. నక్షత్రాలు, గెలాక్సీల పరిణామ క్రమాన్ని, సూపర్‌నోవా పేలుళ్లను అర్థం చేసుకోవడానికి వీటి అధ్యయనం అత్యంత కీలకం. సుమారు 460 కోట్ల సంవత్సరాల క్రితం సూర్యుడు ఏ పదార్థంతో ఏర్పడ్డాడో, అత్యంత పురాతనమైన 'సీఐ కాండ్రైట్' ఉల్కలు కూడా అదే పదార్థంతో రూపుదిద్దుకున్నాయి. దీంతో ఉల్కల్లో ఉన్న పరిమాణంలోనే సూర్యుడిలోనూ వెండి ఉండాలని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. సూర్య కాంతిని విశ్లేషించిన ప్రతిసారీ అక్కడ వెండి స్థాయిలు ఊహించిన దానికంటే తక్కువగా నమోదు కావడం ఏళ్ల తరబడి మిస్టరీగా మారింది.

సిమ్యులేషన్‌తో వాస్తవాలు

ఈ రహస్యాన్ని ఛేదించేందుకు కాలిస్కాన్ బృందం స్వీడన్‌లోని 'టెట్రాలిత్' సూపర్‌కంప్యూటర్ సాయంతో అధునాతన సిమ్యులేషన్లు నిర్వహించింది. కాంతిని గ్రహించే సమయంలో అణువుల ప్రవర్తనపై ప్రభావం చూపే సంక్లిష్ట భౌతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త నమూనాను రూపొందించారు. ఈ విశ్లేషణల ఆధారంగా మునుపటి అంచనాల కంటే సూర్యుడిలో సుమారు 55 శాతం ఎక్కువ వెండి ఉందని నిరూపితమైంది. ఈ కొత్త లెక్కింపు ఉల్కల్లోని వెండి స్థాయిలకు దాదాపు సరిపోలింది. సూర్యుడిలో వెండి నిజంగా తక్కువగా లేదని, అది కేవలం భౌతికశాస్త్ర ప్రభావాల వల్ల ఏర్పడిన ఒక మాయ మాత్రమేనని స్పష్టమవడంతో ఖగోళ పరిశోధనల్లో సరికొత్త అవగాహనకు దారితీసింది.

నాలుగు కంపెనీలపై నిషేధం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణులకు షాక్ ఇస్తూ, హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్ నిబంధనలను ఉల్లంఘించిన నాలుగు సంస్థలపై అమెరికా కార్మిక శాఖ తీవ్ర చర్యలు తీసుకుంది. విదేశీ ఉద్యోగులను స్పాన్సర్ చేయకుండా ఈ కంపెనీలపై నిషేధం విధించింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. గౌరాటెక్ ఎల్ఎల్‌సీ, రెనోటెక్ గ్రూప్ ఎల్ఎల్‌సీ, సీలోజ్ ఇంక్, షేర్‌వుడ్ అకాడమీ (షేర్‌వుడ్ ఎట్ మౌంట్ డోరా ఇంక్) అనే నాలుగు సంస్థలు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. నిబంధనలను బట్టి ఒక్కో కంపెనీపై రెండేళ్ల పాటు ఈ నిషేధ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ కాలంలో ఈ సంస్థలు కొత్తగా ఎలాంటి హెచ్ 1బీ పిటిషన్లను దాఖలు చేయడానికి వీలుండదు. దరఖాస్తుల్లో సాధారణ పొరపాట్లు కాకుండా.. ఉద్దేశపూర్వకంగా చట్టాలను అతిక్రమించడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, కార్మిక నిబంధనలను ఉల్లంఘించడంతోనే ఈ కఠిన ఆంక్షలు విధించినట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక అమెరికన్లకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా, విదేశీ ఉద్యోగులను నియమించుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన కార్మిక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. విదేశీ అభ్యర్థులను తీసుకునే ముందు స్థానికులకు తగిన ప్రాధాన్యం ఇచ్చారా లేదా అనే దానిపై రాబోయే ఐదేళ్ల పాటు ఈ కంపెనీలపై నిఘా కొనసాగనుంది. సాధారణంగా భారతీయ ఐటీ నిపుణులు నేరుగా ఈ తరహా చిన్న కంపెనీలపై ఆధారపడరు కాబట్టి మెజారిటీ అభ్యర్థులపై దీని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. అమెరికాలో ఏ కంపెనీ నుంచైనా ఆఫర్ వచ్చినప్పుడు సదరు సంస్థకు హెచ్ 1బీ స్పాన్సర్‌షిప్ అర్హత ఉందో లేదో అధికారికంగా సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

హెచ్-1బీ వీసాదారులకు భారీ ఊరట

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

అమెరికాలో వరుసగా 7 ఏళ్లుగా నివసిస్తున్న వీసాదారులు అక్కడ శాశ్వత నివాసానికి (గ్రీన్‌కార్డ్) దరఖాస్తు చేసుకునే వీలు కల్పించాలని డెమొక్రటిక్ సెనెటర్ అలెక్స్ పాడిల్లా ప్రతిపాదించారు. అమెరికాలో హెచ్ 1బీ వీసాదారులు, గ్రీన్‌కార్డ్ ల మంజూరు అంశంపై డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీల మధ్య చర్చ సాగుతోంది. ఇటీవలే హెచ్ 1బీ వీసాల జారీని మూడేళ్ల పాటు నిలిపివేయాలని రిపబ్లికన్ సెనెటర్ టిమ్ షీహీ బిల్లు తెచ్చిన నేపథ్యంలో అలెక్స్ పాడిల్లా పూర్తి భిన్నమైన, సానుకూల ప్రతిపాదనలు చేశారు. పాడిల్లా ఇది వరకే తీసుకువచ్చిన 'ఇమిగ్రేషన్ యాక్ట్ ఆఫ్ 1929లో వలస నిబంధనల పునరుద్ధరణ' బిల్లు ఆధారంగా ఈ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. అమెరికాలో ఏడేళ్లుగా నివాసముంటూ ఎలాంటి క్రిమినల్ రికార్డు లేని వలసదారులకు శాశ్వత ప్రాతిపదికన పౌరసత్వం/గ్రీన్‌కార్డు పొందేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. అత్యంత కష్టపడి పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్న వలసదారుల పట్ల ప్రభుత్వం చూపుతున్న కఠిన వైఖరి సరికాదని పాడిల్లా వ్యాఖ్యానించారు. ఇక్కడే స్థిరపడి తమ జీవితాలను నిర్మించుకున్న లక్షలాది కుటుంబాలను అనిశ్చితిలోకి నెట్టడం తగదని ఆయన సూచించారు. మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతున్న సుదీర్ఘకాల నివాసితులను కాంగ్రెస్ విస్మరించకూడదని, వలస చట్టాలను సవరించి శాశ్వత నివాసం కోసం న్యాయపరమైన మార్గాలను సుగమం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే భారతీయులతో సహా లక్షలాది మంది వీసాదారులకు భారీ ఊరట లభిస్తుంది.

సైబర్ నేరాలకు మరణ శిక్ష

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

ఆన్‌లైన్ స్కామ్‌లు, సైబర్ నేరాల నెట్‌వర్క్ లపై మయన్మార్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వీటిని అరికట్టేందుకు పార్లమెంట్‌లో ఒక కఠినమైన 'యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'ను ఆమోదించింది. కొత్త నిబంధనల ప్రకారం.. సైబర్ స్కామ్ కేంద్రాల్లో ప్రజలను అక్రమంగా బంధించినా, హింసించినా లేదా బలవంతంగా పనిచేయించినా నిందితులకు మరణశిక్ష లేదా జీవిత ఖైదు విధించేలా చట్టాన్ని రూపొందించారు. రాజధాని నేపిడాలో నిర్వహించిన ఉభయ సభల సంయుక్త సమావేశంలో మంగళవారం ఈ బిల్లుకు ఆమోదముద్ర పడినట్లు స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే ప్రకటించారు. ఉద్యోగాల పేరుతో మనుషులను ట్రాఫికింగ్ చేసి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా తీవ్రంగా వేధించే వారికి ఈ శిక్షలు వర్తిస్తాయి. బాధితులను కిడ్నాప్ చేసి లేదా బంధించి తీవ్రంగా వేధించడం వల్ల వారు మరణిస్తే నిందితులకు ఖచ్చితంగా మరణశిక్షే పడుతుంది. క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు, సైబర్ క్రైమ్ కేంద్రాలను నడిపే ముఠా నాయకులకు గరిష్టంగా జీవిత ఖైదు పడేలా స్పష్టమైన ప్రొవిజన్లు చేర్చారు. 2021లో అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూల్చివేసిన సైనిక పాలన తర్వాత అక్కడ ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్ లు భారీగా విస్తరించాయి. ఉద్యోగాల కోసం వచ్చిన విదేశీయులను బంధించి, క్రిప్టో పెట్టుబడులు, డేటింగ్ యాప్‌ల పేరిట ప్రపంచవ్యాప్తంగా మోసాలు చేయిస్తున్నట్లు అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు, ఎఫ్ఏటీఎఫ్ వంటి సంస్థల నుంచి హెచ్చరికలు వచ్చాయి. ఇటీవల వివాదాస్పద ఎన్నికల తర్వాత మిన్ ఆంగ్ లైంగ్ నేతృత్వంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఆమోదించిన తొలి చట్టం ఇదే కావడం గమనార్హం.

జపాన్‌లో 7.1 తీవ్రతతో భారీ భూకంపం

ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్)

జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం భారీ భూకంపం వణికించింది. క్యూషులోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించినట్లు జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తీవ్ర ప్రకంపనల ధాటికి పలువురు గాయపడగా, ఒక భవనం నేలమట్టమైనట్లు ప్రధాని సనాయే తకైచి తెలిపారు. కుమమోటోతో పాటు నాగసాకి, కగోషిమా, ఫుకుఓకా, సాగ, ఓయిటా, మియాజాకి ప్రిఫెక్చర్‌లకు అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. భూకంపం తర్వాత తీర ప్రాంతాలకు ఒక మీటరు ఎత్తు వరకు సునామీ అలలు ఎగసిపడే ప్రమాదముందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మీటరు ఎత్తున అలలు నమోదయ్యాయి. బాధితులకు తక్షణమే సహాయక చర్యలు అందించాలని, ప్రాణ రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని ఆదేశించారు. స్థానిక ఫుకుషిమా అణు విద్యుత్ కేంద్రానికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అణు నియంత్రణ సంస్థ స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా పసిఫిక్ 'రింగ్ ఆఫ

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
29.07.2026
www.manasarkar.com

అంగన్‌వాడీల నిరసనపై ఫేక్ ప్రచారం

పెనమలూరు (ఏడీఎన్ఎన్):

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారంటూ కొన్ని ఛానళ్లు, వైసీపీ వర్గాలు చేస్తున్న ప్రచారంపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అది నిరసన కాదని, తమ ప్రభుత్వం చేసిన మంచికి కృతజ్ఞతలు చెప్పేందుకు అంగన్‌వాడీలు వచ్చారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ వైఖరిపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.గత వైసీపీ పాలనలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'అమ్మఒడి' పథకాన్ని వర్తింపజేయకుండా తీవ్ర అన్యాయం చేశారని మంత్రి లోకేశ్ విమర్శించారు. అలాంటి 'గొడ్డలి పార్టీ' ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మన కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు గౌరవం ఇస్తూ, వారి పిల్లలకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తోందని చెప్పారు. పెనమలూరు పర్యటనకు వచ్చిన తనకు కృతజ్ఞతలు తెలిపేందుకే అంగన్‌వాడీలు వచ్చారని వివరించారు.పూర్వంలో "గొడ్డలి పోటును గుండెపోటుగా" మార్చి ప్రచారం చేసిన ఘనత ఆ పార్టీదేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. ఇప్పుడు కూడా అదే తరహాలో అంగన్‌వాడీలు తెలిపిన కృతజ్ఞత ర్యాలీని నిరసన ర్యాలీగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న క్లెమ్‌లపై స్పందిస్తూ,లోకేశ్ అసలు నిజాలను బయటపెట్టారు. అంగన్‌వాడీలు నిరసన తెలుపుతున్నారని, వారిని పట్టించుకోకుండా తాను వెళ్ళిపోయానంటూ ప్రచారం చేస్తున్న పోస్టుల్లోని ఫోటోలను పరిశీలించి, అది కేవలం ఫేక్ ప్రచారమేనని తేల్చిచెప్పారు. అసలు ఫోటో, మార్ఫింగ్ ఫేక్ ఫోటో.. రెండింటినీ జతచేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ వైసీపీ ఫేక్ ప్రచారానికి బలమైన కౌంటర్ ఇచ్చారు.

జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తా

అమరావతి (ఏడీఎన్ఎన్):

విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో బ్యాంకుల జప్తునకు గురయ్యే ప్రమాదంలో ఉన్న దాదాపు రూ.2,000 కోట్ల విలువైన 174.43 ఎకరాల భూమిని కాపాడేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఉప సభాపతి, ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు వెల్లడించారు. అమరావతి అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన అధ్యక్షతన 'అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ' కీలక సమావేశం మంగళవారం జరిగింది. తర్వాత తన చాంబరులో కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, పి.విష్ణు కుమార్ రాజులతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1981లో ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించిందని ఉప సభాపతి రఘురామకృష్ణ తెలిపారు. అయితే, ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఈ విలువైన భూములు బ్యాంకుల జప్తునకు గురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ అంశంతో పాటు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్‌కార్డుల (రీహాబిలిటేషన్ కార్డులు) సమస్యలపై కమిటీ హాల్లో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మరొకసారి కమిటీ భేటీ కానుందని వెల్లడించారు.జాతీయ రహదారి 16కి ఆనుకుని ఉన్న రూ.2,000 కోట్ల విలువైన భూములు చేజారకుండా పల్లా శ్రీనివాసరావు చూస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన భూములను జప్తు చేసేందుకు జరుగుతున్న ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన నిర్వాసితులకు సంబంధించి 1,203 మందికి ఆర్‌కార్డుల రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉందని, వారందరినీ తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని కోరారు.ఈ మీడియా సమావేశంలో ఫిర్యాదుల కమిటీ సభ్యులు, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణు కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్):

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ తో సమగ్ర విచారణ జరిపించాలని వైసీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు'పై మంగళవారం జరిగిన చర్చలో ఆయన వైసీపీ తరఫున పాల్గొని ప్రసంగించారు. ఏపీలో ఎంతోమంది నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్న డీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని, దీనివల్ల అర్హులైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో టీచర్ పోస్టులను అడ్డగోలుగా అమ్ముకున్నారని, దీనికి సంబంధించిన ఆడియో సంభాషణలు కూడా బయటకు వచ్చాయని పార్లమెంట్ దృష్టికి తెచ్చారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విచారణ జరపకపోవడం దారుణమన్నారు. ఈ దారుణ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ లీకేజ్ కేసులో ముందుకు వెళ్లవద్దని అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని ఎంపీ ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నా ఉన్నతాధికారులు లేదా ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కాబట్టి కేంద్రం తీసుకొస్తున్న ఈ నూతన 'యాంటీ పేపర్ లీక్ చట్టం' పరిధిలోకి అన్ని రాష్ట్రాలను, అన్ని రకాల ప్రభుత్వ పరీక్షలను తీసుకురావాలని కోరారు.గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎక్కడా అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికనే లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేశామని గురుమూర్తి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి రిక్రూట్‌మెంట్‌లోనూ అక్రమాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. చివరకు స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అర్హత పరీక్షలను రద్దు చేసి, కనీసం పరీక్ష పాస్ కాని 384 మందికి అక్రమ మార్గంలో ఉద్యోగాలు ఇచ్చారని తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరారు.

అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం

అమరావతి(ఏడీఎన్ఎన్):

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం, దానివల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.అమరావతిలోని సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ సమీక్షకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు హాజరవ్వగా, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు సీఎంకు రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని, వచ్చే మూడు నెలల్లోనూ సరాసరి 35 నుంచి 40 శాతం మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. జూన్,నవంబర్ మధ్య సాధారణంగా 844 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, కేవలం 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని, అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం చూపుతోందని వివరించారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ దీని ప్రభావం ఉన్నప్పటికీ.. ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని పేర్కొన్నారు. దీనివల్ల 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరి పంటలపై ప్రతికూల ప్రభావం పడుతుందని, శ్రీకాకుళం జిల్లాలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదముందని హెచ్చరించారు.పరిస్థితిపై స్పందించిన ముఖ్య

మంత్రి చంద్రబాబు, కృష్ణా,గోదావరి బేసిన్లలో ఎగువ రాష్ట్రాల నుంచి జలాలు వచ్చే అవకాశంపై ఆరా తీశారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార నది నుంచి నీటిని తరలించి ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని ఆదేశించారు.రాష్ట్రంలో అత్యంత ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న 122 "హై రిస్క్" మండలాలను గుర్తించినట్లు అధికారులు తెలుపగా.. ఆ మండలాల్లో బోర్ల ద్వారా నీటిని అందించి పంటలను కాపాడుకునే ప్రక్రియను వెంటనే పరిశీలించాలని సీఎం సూచించారు.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆగస్టు 3వ తేదీ నుంచి రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించామని, అత్యవసర విత్తన ప్రణాళికను కూడా సిద్ధం చేశామని వివరించారు.రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు 'ఫసల్ బీమా యోజన', వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని.. వరి పంట నమోదుకు ఆగస్టు 15 వరకు సమయం ఉందని అధికారులు స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలో పశుగ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా చర్యలు చేపట్టామని, రాబోయే 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

నీతో చర్చకు నేను చాలు

కృష్ణ జిల్లా (ఏడీఎన్ఎన్):

రాష్ట్రంలో డిఫాక్టో సీఎంగా చెలామణి అవుతున్న మంత్రి నారా లోకేశ్ తన ఉత్తర కుమార ప్రగల్భాలు కట్టిపెట్టాలని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకేశ్ వైఖరిపై విరుచుకుపడ్డారు. దమ్ముంటే చర్చకు రావాలని సవాళ్లు విసరడం కాదని, దేనికైనా సమవుజ్జీ ఉండాలని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చకు వస్తే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వస్తారని, అదే తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన లోకేశ్ చర్చకు వస్తే మాట్లాడటానికి తానే వస్తానని బహిరంగ సవాల్ విసిరారు. విద్యాశాఖ మినహా అన్ని శాఖల వ్యవహారాల్లోనూ లోకేశ్ వేలు పెడుతున్నారని పేర్ని నాని దుయ్యబట్టారు. కంపెనీలు తెచ్చానని, ఉద్యోగాలు ఇచ్చానని, రెడ్ బుక్ రుచి చూశారా అని కార్యకర్తలతో చప్పట్లు కొట్టించుకోవడానికి వైఎస్ జగన్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. లోకేశ్ మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప క్షేత్రస్థాయిలో ఏమీ లేదని విమర్శించారు. తాజాగా చేపట్టిన డీఎస్సీ నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పవిత్రమైన ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీలో తీవ్ర పాపాలు చేశారని, ఇది ఒక దిక్కుమాలిన డీఎస్సీ అని ధ్వజమెత్తారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వమే అన్ని పాత్రలూ పోషిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే జిల్లా కలెక్టరేట్లలో మెరిట్ లిస్ట్ లు ఎందుకు ప్రదర్శించలేకపోయారని పేర్ని నాని ప్రశ్నించారు. గోల్డ్ మెడల్ సాధించిన ప్రతిభావంతులకు కాకుండా, కేవలం పాల్గొన్న వారికి, తమ వెంట తిరిగిన సొంత పార్టీ కార్యకర్తలకే ఉద్యోగాలు కట్టబెట్టి ఇప్పుడు నీతి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. లోకేశ్ కి

నిజంగా సత్తా ఉంటే, ఈ డీఎస్సీలో జరిగిన అక్రమాలపై తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. స్పోర్ట్స్ కోటా రిక్రూట్‌మెంట్‌పై కోర్టు విచారణ జరపమని స్పష్టంగా చెప్పిందని గుర్తు చేస్తూ, ధైర్యముంటే ఆ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌పై నిజాయితీ ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. ఎలాగూ బోండా ఉమ లాంటి నేతలు మంత్రి పదవి కోసం ఆశగా ముచ్చటపడుతున్నారు కాబట్టి, పదవికి రాజీనామా చేసి ఆయనకు ఇచ్చేయాలంటూ లోకేశ్ ను ఉద్దేశించి పేర్ని నాని ఘాటుగా వ్యాఖ్యానించారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

తిరుపతి (ఏడీఎన్ఎన్):

రాష్ట్రంలో చేపట్టిన డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగాయని, దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి ఆర్కే రోజా డిమాండ్ చేశారు. డీఎస్సీ స్కామ్‌కు నిరసనగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సెకండ్ గేట్ వద్ద వైసీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆర్కే రోజా, కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ తీరుపై నిప్పులు చెరిగారు.ఈ సందర్భంగా ఆర్కే రోజా మాట్లాడుతూ.. "ఇది ఎంతమాత్రం మెగా డీఎస్సీ కాదు.. కేవలం నిరుద్యోగులను మోసం చేసిన 'దగా డీఎస్సీ'" అని మండిపడ్డారు. డీఎస్సీ పేపర్ లీకేజీతో పాటు రిక్రూట్‌మెంట్‌లో ప్రతిభావంతులను పక్కనబెట్టి అనర్హులకు పట్టం కట్టారని ఆరోపించారు. ప్రభుత్వం జి.ఓ. 420 తీసుకువచ్చి ఏకంగా 427 పోస్టులను అనర్హులకు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసేంత

వరకు తమ పోరాటం ఆగదని, నిరుద్యోగుల తరఫున రోడ్లపైనే పోరాడతామని తేల్చి చెప్పారు.రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 7,000 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు నెలనెలా రూ.3,000 భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక దారుణంగా మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగాలు లేక రాష్ట్రంలో కోటిన్నరకు పైగా నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లి పనులు చేసుకుంటున్నారని, దాదాపు 191 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పారదర్శకంగా ఏకంగా 1,30,000 ఉద్యోగాలు భర్తీ చేశారని రోజా గుర్తు చేశారు. జగనన్న ధైర్యం,కమిట్‌మెంట్ గురించి తెలుసుకోవాలంటే సోనియా గాంధీని లేదా తండ్రి చంద్రబాబును అడగాలని లోకేశ్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ కూటమి పాలనలో మొదట మహిళల జీవితాలతో ఆడారని, ఇప్పుడు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం కేవలం ప్రచారానికి, భజన పత్రికలకే పరిమితమైందని రోజా విమర్శించారు. "చంద్రబాబు నాయుడి ప్రాణం ఒక ప్రముఖ పేపర్‌లో ఉంది. వారిద్దరి మధ్య ఉన్న అవినాభావ సంబంధం ఇప్పుడు బయటపడింది". అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆడపిల్లలపై దారుణాలు, అత్యాచారాలు జరుగుతున్నా కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, కేవలం భజన పత్రికల ప్రయోజనాల కోసమే చంద్రబాబు పని చేస్తున్నారని ఆర్కే రోజా ఆరోపించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

కుప్పం (ఏడీఎన్ఎన్):

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, వివేకవంతమైన నిర్ణయాలతో యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. కుప్పం పర్యటనలో భాగంగా రెండో రోజైన మంగళవారం స్థానిక పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆమె క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా, వారి క్రీడలను వీక్షించి అలరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయని భువనేశ్వరి పేర్కొన్నారు. విద్యార్థుల ప్రోత్సాహార్థం 'తల్లికి వందనం' పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.15,000 ఆర్థిక

సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక కృషితో రాష్ట్రంలో ఏకంగా 1.06 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను వీడి ప్రభుత్వ బడుల్లో చేరారని వివరించారు. ఈ సందర్భంగా కుటుంబ విశేషాలను పంచుకుంటూ.. తన మనవడు దేవాన్ష్ టీవీలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యమిస్తాడని గుర్తుచేశారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకూడదని, వ్యసనాలు బంగారు జీవితాలను నాశనం చేస్తాయని హెచ్చరించారు. పరీక్షల్లో విఫలమవడం జీవితానికి ముగింపు కాదని భువనేశ్వరి విద్యార్థులకు హితవు పలికారు. తోటి విద్యార్థులు ఎవరూ ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుని కన్న తల్లిదండ్రులకు జీవితాంతం శోకం మిగల్చవద్దని కోరారు. తల్లిదండ్రులను, బోధించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.మహాత్మా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ల జీవితాల నుంచి స్ఫూర్తి పొంది సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజినీర్ వంటి ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, ఈ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందంటూ భువనేశ్వరి దిశానిర్దేశం చేశారు.

పార్టీ లైన్ దాటలేదు.. అది సమన్వయ లోపమే

అమరావతి(ఏడీఎన్ఎన్):

వైసీపీ నేతలతో వేదిక పంచుకున్నారనే వ్యవహారంపై తీవ్ర వివాదం రేగడంతో, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు టీడీపీ అధిష్టానానికి స్పష్టమైన వివరణ ఇచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌కు మంగళవారం వచ్చిన ఆయన.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి రామానాయుడులను కలిసి ఈ ఘటనకు సంబంధించి తన వైఖరిని స్పష్టం చేశారు.అధిష్టానంతో భేటీ తర్వాత ఎమ్మెల్యే బొండా ఉమా మీడియాతో మాట్లాడుతూ.. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన 'ముద్రగడ సం

స్మరణ సభ'కు తాను హాజరైనప్పుడు అక్కడకు వచ్చిన వైసీపీ నేత అంబటి రాంబాబుతో వేదిక పంచుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అయితే, ఈ విషయాన్ని కొంతమంది సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తూ రచ్చ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కొన్ని దుష్టశక్తులు ఉద్దేశపూర్వకంగానే తన మాటలను, జరిగిన ఘటనను వక్రీకరించి పార్టీ ప్రతిష్టకు, తన వ్యక్తిత్వానికి బురదజల్లే ప్రయత్నం చేశాయని బొండా ఉమా ఆరోపించారు. తాను అనని మాటలను కూడా కొన్ని టీవీ ఛానెళ్లలో ప్రసారం చేశారన్నారు."నేను ఎప్పటికీ పార్టీ లైన్ దాటను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాలను ఎల్లప్పుడూ శిరసావహిస్తాను. ఈ మొత్తం వ్యవహారం కేవలం చిన్న సమన్వయ లోపం వల్ల జరిగింది తప్ప మరొకటి కాదు," అని పార్టీ పెద్దలకు వివరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా జాగ్రత్త పడతానని ఆయన స్పష్టం చేశారు.

కన్నుల పండువగా గిరిప్రదక్షిణ

విశాఖపట్నం(ఏడీఎన్ఎన్):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి 'గిరిప్రదక్షిణ' మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. భక్తజన సంద్రమైన గిరి ప్రదక్షిణ మార్గాలన్నీ స్వామివారి దివ్య నామస్మరణతో పవిత్ర శోభను సంతరించుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో విశాఖ నగరం, గిరిప్రదక్షిణ దారులు మంగళవారం కిటకిటలాడుతున్నాయి.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక ప్రజలు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. మార్గమంతటా భక్తుల కోసం అల్పాహారం, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.గిరిప్రదక్షిణ ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అధికారులు, పోలీసులు పూర్తి సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బలగాలను రంగంలోకి దించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే సున్నిత ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారుభక్తుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అటవీ, గిరి మార్గాల్లో మొత్తం 33 ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అలాగే అత్యవసర వైద్య సేవల నిమిత్తం 26 అంబులెన్స్ లను నిరంతరం సిద్ధంగా ఉంచారు. అధికారుల ముందస్తు ప్రణాళికతో సింహాద్రి అప్పన్న గిరిప్రదక్షిణ అత్యంత వైభవంగా, ప్రశాంతంగా కొనసాగుతోంది.

ముగిసిన ఎమ్మెల్సీల పదవీకాలం

అమరావతి(ఏడీఎన్ఎన్):

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో గవర్నర్ కోటా కింద నియమితులైన ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం సోమవారంతో ముగిసింది. మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుల పదవీకాలం పూర్తయినట్లు శాసనమండలి సచివాలయం మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో, ఖాళీ అయిన ఈ రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలను అధికార టీడీపీ నేతలతోనే భర్తీ చేయనున్నారు. దీంతో ఈ పదవులను దక్కించుకునేందుకు పార్టీలో తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది.ఖాళీ అయిన ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం టీడీపీ నుంచి ఏకంగా 20 మందికి పైగా కీలక నాయకులు పోటీపడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు ఆశించి భంగపడిన వారు, ఇటీవల రాజ్యసభ అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్న సీనియర్ నేతలు ఈ పదవులపై కన్నేశారు. ఇప్పటికే పలువురు ఆశావహులు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిని కలసి తమ విన్నపాలు అందజేసినట్లు సమాచారం.ఈ రేసులో ఉన్న ఆశావహుల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన నేతలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా దేవినేని ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, వంగవీటి రాధా, టీడీ జనార్దన్, గొట్టిపాటి రామకృష్ణ, బుద్ధా వెంకన్న వంటి సీనియర్, ప్రముఖ నాయకుల పేర్లు విపరీతంగా ప్రచారంలో ఉన్నాయి. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీకి రానుండటంతో, ప్రస్తుతం అధికార యంత్రాంగం,పార్టీ అధిష్టానం ఆ పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ప్రధాని పర్యటన ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ప్రక

హైడ్రాను మరింత బలోపేతం చేస్తాం

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)

హైడ్రా కమిషనర్ అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ, ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను క్షుణ్ణంగా సమీక్షిస్తామని తెలిపారు. దిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కబ్జాకోరులు ఫేక్ పత్రాలను సృష్టించి కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత ఏకంగా 10 ఎకరాలు కబ్జా చేశారని, కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించారని ఎద్దేవా చేశారు. పదికరాలు కబ్జా చేస్తే ఎవరైనా కనకవర్షం కూడా కురిపించవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. హైడ్రా అనేది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణ అని, దీనిని భవిష్యత్తులో మరింత బలోపేతం చేసి పనులను నిరంతరం కొనసాగిస్తామని సీఎం స్పష్టం చేశారు. చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడటమే హైడ్రా సిబ్బంది ప్రధాన విధి అని పేర్కొన్నారు. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించి కోర్టుకెళ్లారని, ఎన్ కన్వెన్షన్ లేదా గండిపేట చెరువు ఆక్రమణలను కూల్చివేస్తే అవి పేదలవని ఎలా అంటారని ప్రశ్నించారు. కబ్జాదారులను కాపాడేందుకు భారీగా డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. గతంలో సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులున్నాయని గుర్తుచేశారు. హైడ్రాపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఏ అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుందని, తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో సమర్థవంతంగా ఎదుర్కొంటామని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు.

ఇకపై ప్రతియేటా ఫీజు రీఎంబర్స్ మెంట్ చెల్లింపు

ఇకపై ఫీజు రీయింబర్స్ మెంట్‌ను ఏటా క్రమం తప్పకుండా చెల్లిస్తామని, భవిష్యత్తులో ఈ బకాయిల సమస్యే రాకుండా తగిన ప్రణాళికలు రూపొందించినట్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను ఎత్తేయాలని చూసిన సంస్థలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో పెండింగ్‌లో పెట్టిన రూ.8,000 కోట్ల బకాయిలు ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర భారంగా మారాయని, తామే ఆ బకాయిలు ఇవ్వట్లేదనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై ప్రశ్నిస్తున్న బీజేపీ రాష్ట్ర నేతలు, ఇతర ఎంపీలు ఏపీలోని ఎన్డీయే ప్రభుత్వంపై కూడా స్పందిస్తే బాగుంటుందని హితవు పలికారు. ఆఫ్‌లైన్ పరీక్షల నిర్వహణలో వస్తున్న సమస్యలపై బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. గ్లోబరీనా లాంటి సంస్థలు గతంలో తెలంగాణలో అక్రమాలకు పాల్పడినా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్లే అవి సీబీఎస్ఈకి విస్తరించాయని విమర్శించారు. విద్యా వ్యవస్థలో రాష్ట్ర పరిధిలోని అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి అత్యంత పారదర్శకంగా నియామకాలు చేపట్టి విద్యార్థులకు భరోసా కల్పించామని సీఎం పేర్కొన్నారు.

సనాతన ధర్మాన్ని ఎవరూ మార్చలేరు

- **హుజురాబాద్ లో బీజేపీ చీఫ్ రామచందర్ రావు పర్యటన**

కరీంనగర్ జిల్లా(ఏడీఎన్ఎన్)

కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పాల్గొని ప్రసంగించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ బలోపేతం కావడం శుభపరిణామమని, విద్యావంతులు పెద్దఎత్తున పార్టీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో భాగంగా సనాతన ధర్మాన్ని ఎవరూ ఏమీ చేయలేరని రామచందర్ రావు స్పష్టం చేశారు. ప్రపంచంలో అనేక దేశాలు మత ప్రాతిపదికన మారినప్పటికీ సనాతన ధర్మాన్ని ఎవరూ మార్చలేకపోయారన్నారు. యువత పేరుతో దేశాన్ని విడగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని, అమెరికా, దుబాయ్ వంటి దేశాల నుండి దీనికోసం ఫండింగ్ అందుతోందని ఆరోపించారు. దేశ భద్రతకు ముప్పు వాటిల్లితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి పదేళ్లకోసారి జరిగే జనాభా లెక్కల సేకరణ (సెన్సస్) ప్రక్రియపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ఐక్యతను కాపాడేందుకు ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

మూడో భాషగా జర్మన్, జపనీస్

నేర్పాలని విజ్ఞప్తి

- **కేంద్రమంత్రులను కలిసి విన్నవించిన మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ**

న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్)

విదేశీ భాషలు నేర్చుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తాయని, కాబట్టి థర్డ్ లాంగ్వేజ్‌లో జర్మన్, జపనీస్ భాషలకు తగిన అవకాశమివ్వాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌధరిని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. సోమవారం ఆయన ఎంపీ వంశీకృష్ణతో కలిసి ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశామని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా రామగుండంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు తక్షణమే జీవో జారీ చేయాలని కోరుతూ కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను కలిసి విజ్ఞప్తి చేశారు. తర్వాత కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కూడా కలిసి పలు రాష్ట్ర అంశాలపై చర్చించారు.

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సీఎం భేటీ

- **రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని విజ్ఞప్తి**

న్యూ ఢిల్లీ(ఏడీఎన్ఎన్)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన అత్యంత బిజీబిజీగా సాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, ఉపాధి హామీ పథకంలో కొత్త పనుల చేరిక, నివాస గృహాల నిర్మాణాలకు సంబంధించిన వివరాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి విస్తృతంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో గ్రామీణ ఇళ్ల నిర్మాణం తీవ్రంగా నిర్లక్ష్యానికి గురైందని, కాబట్టి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద రాష్ట్రానికి 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వీబీజీ రామ్‌జీ జాబితాలో చేర్చి, లబ్ధిదారులకు 90 రోజుల పాటు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వీబీజీ రామ్‌జీ పథకంలో అదనపు పనులను చేర్చాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణం వంటి 10 రకాల కొత్త పనులకు అనుమతి ఇవ్వాలని సీఎం కోరారు. వీటితో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులకు ఉపాధి హామీ కింద అవకాశం కల్పించాలని కోరారు.

రాజకీయాల్లో నైతికతకు ప్రతీక జైపాల్ రెడ్డి

కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో నైతికతకు జైపాల్ రెడ్డి పెద్దపీట వేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. విద్యార్థి దశలోనే నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన, తన తుదిశ్వాస విడిచే వరకు ప్రజా సంక్షేమం, రాజకీయ విలువలు, సిద్ధాంతాలకు ఎక్కడా రాజీపడకుండా కట్టుబడి జీవించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. అద్భుతమైన విషయ పరిజ్ఞానం, పార్లమెంటరీ రంగంలో ఎవరికీ లేని వాగ్ధాటితో జైపాల్ రెడ్డి ఇటు ప్రజల హృదయాల్లో, అటు పార్లమెంటు వేదికపై తనదైన చెరగని ముద్ర వేశారని ముఖ్యమంత్రి తెలిపారు. దేశ రాజకీయాల్లో ఆయన చూపిన మార్గం ఎంతోమంది యువ నాయకులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి ఆశయాలను, ఆయన చూపిన బాటను భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందుకు తీసుకువెళ్తుందని, ఆయన ఆశయ సాధనకు పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ఈ నివాళి కార్యక్రానంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రోహిణ్ రెడ్డి, తుమ్మల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. జైపాల్ రెడ్డి సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.

తెలంగాణ ఏసీబీ సరికొత్త రికార్డు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)

అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ తన చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. 2026 రెండో త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) అత్యధిక కేసులు నమోదు చేసినట్లు ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా ఐపీఎస్ వెల్లడించారు. 1983 తర్వాత ఒక త్రైమాసికంలో అత్యధిక సంఖ్యలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారని ఆమె తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో 2026 రెండో త్రైమాసికంలో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతిని డీజీ సమీక్షించారు. అవినీతిపై తెలంగాణ ఏసీబీ ఉక్కుపాదం మోపుతుందని, అవినీతిపై రాజీ లేకుండా చర్యలు కొనసాగిస్తామని ఏసీబీ డీజీ చారు సిన్హా స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30, 2026 వరకూ తెలంగాణ ఏసీబీ మొత్తం 10 ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులు, 34 ట్రాప్ కేసులు, 23 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డు స్థాయిలో కేసులు నమోదు చేసింది. 1983లో ఏసీబీ ప్రారంభమైన తర్వాత ఒకే త్రైమాసికంలో ఇంత భారీ స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఏసీబీ పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇది సంస్థ అవినీతిపై దృష్టి, నిరంతర అప్రమత్తత, అధికారుల వృత్తి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఏసీబీ అధికారులు, సిబ్బంది కృషిని అభినందించేందుకు,వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా 'రివార్డ్ మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు డీజీ చారు సిన్హా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. అవినీతి దేశాన్ని లోపల నుంచే బలహీనపరుస్తుందని పేర్కొన్న ఆమె, అధికారులు నిజాయితీ, సంకల్పంతో ప్రజా బాధ్యతను నిర్వర్తించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని సూచించారు. ఏసీబీ ప్రాధాన్యత ఎల్లప్పుడూ నిష్పాక్షిక, సమగ్ర దర్యాప్తేనని, నిజాయితీ, జవాబుదారీతనం, సుపరిపాలన పరిరక్షణలో ఏసీబీ ముందంజలో ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)

హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు గట్టి ఎదురుదెబ్బ అని డాక్టర్ శ్రవణ్ దాసోజు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ తీర్పు ఒక అధికారిపై మాత్రమే కాకుండా ప్రభుత్వం అమలు చేసిన బుల్డోజర్ విధానంపై రాజ్యాంగం సాధించిన విజయమని పేర్కొన్నారు.హైడ్రా వ్యవహారంలో కమిషనర్ రంగనాథ్ కేవలం ఆదేశాలను అమలు చేసిన వ్యక్తి మాత్రమేనని, అసలు బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని శ్రవణ్ దాసోజు ఆరోపించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా సీఎం ఇచ్చిన ఆదేశాల ప్రకారమే చర్యలు జరిగాయని, చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ పేదల జీవితాలతో చెలగాట మాడారని విమర్శించారు. రంగనాథ్‌ను తప్పించాలని కోర్టు ఆదేశించడం ప్రభుత్వం అనుసరించిన పాలనపై తీవ్ర అభ్యంతరంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు.హైకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. అలాగే నోటీసులు ఇవ్వకుండా చేపట్టిన కూల్చివేతల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లించాలని కోరింది. హైడ్రా కమిషనర్‌ను వెంటనే బాధ్యతల నుంచి తప్పించడంతో పాటు ఈ తీర్పుపై ప్రభుత్వం డివిజన్ బెంచ్ లేదా సుప్రీం కోర్టుకు అప్పీల్ చేయకుండా హైకోర్టు ఆదేశాలను గౌరవించాలని సూచించింది.హైడ్రా చర్యలు ఎంపిక చేసిన లక్ష్యాలపైనే సాగాయని శ్రవణ్ దాసోజు ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన నిర్మాణాల విషయంలో చర్యలు తీసుకోకుండా పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న ఉద్యోగుల ఇళ్లపైనే బుల్డోజర్లు నడిపారని విమర్శించారు. నోటీసుల పేరుతో వేధింపులు, బెదిరింపులు జరిగాయని కూడా ఆరోపించారు. హైకోర్టు ఆదేశాల తర్వాత కూడా కమిషనర్ మీడియా ముందుకు వచ్చి చేసిన వ్యాఖ్యలు కోర్టు ధిక్కారానికే సంకేతమని అన్నారు. ఎన్నికల సమయంలోనే హైడ్రా ప్రమాదకర వ్యవస్థ అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారని, తాజా పరిణామాలతో వారి వ్యాఖ్యలు నిజమయ్యాయని శ్రవణ్ దాసోజు పేర్కొన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే చట్టవిరుద్ధంగా వ్యవహరించిన ప్రతి అధికారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ నాయకులు మారినా రాజ్యాంగం శాశ్వతమని, చట్టాన్ని అతిక్రమించిన ప్రతి ఒక్కరూ జవాబుదారులవుతారని స్పష్టం చేశారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

- **రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఢిల్లీ టూర్ పై ఎంపీ అరవింద్ తీవ్ర ఆరోపణలు**

నిజామాబాద్ జిల్లా(ఏడీఎన్ఎన్)

సీట్ పేపర్ లీకైనందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, మరి తెలంగాణలో ప్రతి ఏడాది 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ రాక ఇబ్బంది పడుతున్నా ఏ ముఖం పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, జెన్ జీల గురించి మాట్లాడే సీఎం ముందుగా తన వద్ద ఉన్న విద్యాశాఖను కాంగ్రెస్‌లోని యువ ఎమ్మెల్యేలకు ఇవ్వాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి మాత్రం కేంద్ర విద్యాశాఖ మంత్రి ఎవరో నిర్ణయించే పనిలో ఉన్నారని, రాహుల్ గాంధీని సైడ్ చేసి ప్రధాని కావాలనే ఆలోచనలో ఉన్నారా అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని, రాష్ట్రంలో కాలేజీలు మూసేసే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ వైఫల్యం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై త్వరలోనే లక్ష మంది విద్యార్థులతో హైదరాబాద్‌లో భారీ ధర్నాకు ప్లాన్ చేస్తున్నామని ఎంపీ అర్వింద్ ప్రకటించారు. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ వైఫల్యమే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ అధికారంలోకి రావడానికి ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ మంత్రుల యావరేజ్ ఏజ్ 62 ఏళ్లు అని, పూరాతనమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు జెన్ జీ గురించి మాట్లాడతారా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ మాట్లాడుకునే ఒకేసారి ఢిల్లీ పర్యటనకు వచ్చారని ఆరోపించారు. ఈకార్ రేస్, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరంతో పాటు అనేక అంశాల్లో ఈ రెండు పార్టీలు కోఆర్డినేషన్‌తోనే నడుస్తున్నాయని, రాష్ట్రాన్ని దోచుకుని బీఆర్ఎస్ వెళ్లిపోతే ఆ దొంగలను దోచుకునేందుకు ఇద్దరూ ఢిల్లీకి వచ్చారని మండిపడ్డారు. సీబీఐ విచారణకు కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడు బ్యారేజీలకు మాత్రమే ఎందుకు పరిమితం చేశారని ప్రశ్నించారు.పాలన చేతకాక రేవంత్ రెడ్డి ఇతరులపై బురద జల్లే పని చేస్తున్నారని అర్వింద్ విమర్శించారు. యూరియాను బ్లాక్‌లో అమ్ముకొని, కొరత వచ్చిందని కేంద్రంపై నెపం నెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణకు 2016-17లో 26.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇస్తే..2025-26 లో 42.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను కేంద్రం అందించిందని తెలిపారు. ఏప్రిల్ నుండి జూలై మధ్యలో డిఎపి విషయంలో 28 షోకాజ్ నోటీసులు, 9 లైసెన్స్ క్యాన్సిలేషన్లు, 3 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, వీటిపై ఇన్వెస్టిగేషన్ చేస్తే అందరూ కాంగ్రెస్ వాళ్లే ఉన్నారని ధ్వజమెత్తారు.

వివాదాల శాశ్వత పరిష్కారం కోసమే భూ రీసర్వే

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని తెలిపారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ రీ సర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, ప్రయోజనాలను రైతులకు వివరించాలని అధికారులకు సూచించారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం ద్వారా ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని చెప్పారు. నక్షా లేని 373 గ్రామాల్లోనూ రీ సర్వే చురుకుగా సాగుతోందని, పట్టాదారులకు ముందుగా నోటీసులు ఇవ్వాలని, ప్రభుత్వ భూములు, గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

పారదర్శకంగా టీవీ అవార్డుల ఎంపిక

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)

తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి టీవీ అవార్డుల కమిటీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అవార్డుల లోగో, పేర్లు, కేటగిరీలపై కమిటీ సభ్యులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. అవార్డుల పేరు ,లోగో ప్రత్యేకంగా తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు సూచించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. అలాగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం కోసం రెండు, మూడు వేదికలను సూచించాలని కోరగా, సీఎంతో చర్చించిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. నేడు టెలివిజన్ రంగం ప్రజలకు అత్యధికంగా ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ రంగంలో అంకితభావంతో రాణిస్తున్న అన్ని కేటగిరీల వారిని ప్రభుత్వం తరఫున తగిన రీతిలో ప్రోత్సహిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

500 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల ఫలితాలు విడుదల

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)

డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ఆసుపత్రులలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా జనరల్ సర్జరీ విభాగంలో 174, జనరల్ మెడిసిన్ విభాగంలో 166, ఆర్థోపెడిక్స్ విభాగంలో 89, రేడియాలజీ విభాగంలో 71 చొప్పున మొత్తం 500 పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను ఎంహెచ్ఎస్ఆర్‌బీ విడుదల చేసింది. ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల తర్వాత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను పూర్తి చేసి ఈ ఫలితాలను ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థుల పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 692 పోస్టుల భర్తీ పూర్తయి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి పోస్టింగ్స్ కూడా ఇవ్వడం జరిగింది. తాజా ఫలితాలతో కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 1,192 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో నూతనంగా ఎంపికైన స్పెషలిస్ట్ డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు.

కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత

బీఆర్ఎస్‌కు లేదు

హైదరాబాద్(ఏడీఎన్ఎన్)

కృష్ణా జలాలపై మాట్లాడే నైతిక హక్కు భారాసకు లేదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కర్ణాటకలో డ్యాములు కడుతున్నప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని ఆయన నిలదీశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన విమర్శలను మంత్రి సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, భీమా, కృష్ణా నదుల నీటిని నిల్వ చేసి సాగు, తాగునీరు అందించాలనే ఆలోచన కూడా ఆ ప్రభుత్వానికి రాలేదని విమర్శించారు. ప్రస

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
29.07.2026
www.manasarkar.com

రాశి ఫలాలు

29-07-2026 బుధవారం

మేషం:

వృత్తి, వ్యాపారాల్లో లాభాలు కొద్దిగా వృద్ధి చెందుతాయి. కుటుంబపరంగా చిన్నపాటి సమస్యలు ఉండవచ్చు. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించడం మంచిది. బంధువుల నుంచి ఆశించిన శుభ వార్తలు వింటారు. రావలసిన డబ్బు అనుకోకుండా చేతికి అందుతుంది. నిరుద్యోగులకు ఒకటి రెండు ఆఫర్లు అందుతాయి.

వృషభం:

వృత్తి, వ్యాపారాల్లో కీలక మార్పులు చేపట్టి ఆశించిన ఫలితాల్ని పొందుతారు. నిరుద్యోగులకు సొంత ఊర్లోనే ఉద్యోగం వచ్చే అవకాశముంది. బంధు వర్గంలో మంచి పెళ్లి సంబంధం నిశ్చయం అవు తుంది. ప్రయాణాల వల్ల లాభం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో జీవిత భాగస్వామిని సంప్రదించడం మంచిది. ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోంది. కానీ, వృథా ఖర్చులు పెరుగుతాయి.

మిథునం:

ఉద్యోగంలో పనితీరుతో అధికారుల్ని ఆకట్టుకుంటారు. వృత్తి, వ్యాపారాలు నల్లేరు మీద బండిలా సాగిపోతాయి. కుటుంబ జీవితం బాగా హ్యాపీగా సాగిపోతుంది. ఆదాయ వ్యయాలు దాదాపు సమానంగా ఉంటాయి. బంధుమిత్రుల నుంచి ఆర్థిక సహాయం కోసం ఒత్తిడి ఉంటుంది. ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు సఫలమవుతాయి. ఉద్యోగం మారడానికి అవకాశముంది.

కర్కాటకం:

ఆస్తి, ఆర్థిక వ్యవహారాల్లో కొద్దిగా ఒత్తిడి ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు లాభాల బాటపడతాయి. కుటుంబ పరిస్థితులు బాగా అనుకూలంగా ఉంటాయి. ఒకటి రెండు వ్యక్తిగత సమస్యలు తీరిపోయి, మనశ్శాంతి కలుగుతుంది. వ్యయప్రయాసలతో గానీ ఏ పనీ ఒక పట్టాన పూర్తి కాదు. ఖర్చులు పెరుగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్య ఉంటుంది.

సింహం:

ఉద్యోగంలో అధికారుల నుంచి ప్రోత్సాహం, ఆదరణ లభిస్తాయి. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించడం మంచిది. ఆర్థిక విషయాల్ని బయటపెట్టకపోవడం శ్రేయస్కరం. ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేస్తారు. ఆరోగ్యం మీద కాస్తంత శ్రద్ధ పెట్టడం అవసరం. ఉద్యోగంతో నిమిత్తం లేకుండా అదనపు రాబడి మీద దృష్టి పెడతారు. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాల్లో తప్పకుండా ఆశించిన శుభవార్తలు వింటారు.

కన్య:

ఉద్యోగంలో అధికారులు అతిగా ఉపయోగించుకుంటారు. ఇతరుల బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తుంది. శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో రాబడి బాగా పెరిగే అవకాశ ముంది. ఆదాయం మెరుగ్గా ఉంటుంది కానీ, ఖర్చులు, సహాయాలు పెరిగే అవకాశం ఉంది. రావ లసిన డబ్బు అనుకోకుండా చేతికి అందుతుంది.

తుల:

అధికారులను పనితీరుతో ఆకట్టుకుంటారు. వ్యాపారాల్లో కొత్త ఆలోచనలను ప్రవేశపెట్టి విజయాలు పొందుతారు. ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. ఆదాయానికేమీ లోటుండదు. ఆశించిన శుభ వార్తలు వింటారు. నిరుద్యోగులకు మంచి ఆఫర్లు అందుతాయి. ఆహార, విహారాల్లో జాగ్రత్తగా ఉండాలి. మంచి పరిచయాలు కలుగుతాయి.

వృశ్చికం:

ఉద్యోగంలో పనిభారం ఎక్కువగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు కొద్దిపాటి లాభాలతో పురోగమి స్తాయి. ధన సంపాదన నిలకడగా సాగిపోతుంది. సంపాదన పెంచుకోవడానికి మార్గాలు వెతుకు తారు. ఖర్చుల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించడం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలు పెండింగులో పడతాయి. నిరుద్యోగులకు సమయం అనుకూలంగా ఉంది.

ధనస్సు:

వృత్తి, వ్యాపారాల్లో ఒక్క క్షణం తీరిక ఉండని పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక విషయాల్లో సమయం బాగా అనుకూలంగా ఉంది. శుభవార్తలు ఎక్కువగా వినడం జరుగుతుంది. ఆదాయం రూపంలో అదృష్టం పడుతుంది. కుటుంబంలో ఒక శుభ పరిణామం చోటు చేసుకుంటుంది. ఆరోగ్యానికి ఢోకా ఉండదు.

మకరం:

ఉద్యోగంలో బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఆశించిన ప్రతిఫలం లభిస్తుంది. డాక్టర్లు, లాయర్ల వంటి వృత్తులవారికి మంచి గుర్తింపు లభిస్తుంది. ఆదాయానికి లోటుండదు కానీ, అనుకోని ఖర్చులు ఇబ్బంది పెడతాయి. అనవసర సహాయాలు చేయకపోవడం మంచిది. ఒకటి రెండు చిన్నా చితకా సమస్యల నుంచి బయటపడతారు.

కుంభం:

వృత్తి, వ్యాపారాల్లో శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువగా ఉంటుంది. వ్యాపారాల్లో పోటీ దార్ల నుంచి ఒత్తిడి ఉంటుంది. అనేక మార్గాల్లో ధన సంపాదన ఉన్నప్పటికీ, అనవసర ఖర్చులు అధికంగా ఉంటాయి. నిరుద్యోగులు సాధారణ ఉద్యోగంతో సర్దుకుపోవాల్సి వస్తుంది. పెళ్లి ప్రయత్నాల విషయంలో శుభవార్తలు అందే అవకాశముంది. ఆరోగ్యం బాగా అనుకూలంగా ఉంటుంది.

మీనం:

వృత్తి, ఉద్యోగాల్లో అధికారుల నుంచి ప్రోత్సాహం ఉంటుంది. వ్యాపారాల్లో కొద్దిపాటి లాభాలు కనిపిస్తాయి. కుటుంబ పరిస్థితులు బాగా అనుకూలంగా ఉంటాయి. ఆదాయం నిలకడగా ఉంటుంది. కొన్ని ఖర్చులు తగ్గించుకుం టారు. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. దైవ కార్యాల్లో, శుభ కార్యాల్లో పాల్గొంటారు.

85 పీజీఆర్ఎస్ రీఓపెన్ అర్జీలు పెండింగ్

- 'గ్రీవెన్స్' పై పల్నాడు అధికారుల అలసత్వం
- కొచ్చర్ల ఘటనతో కదిలిన యంత్రాంగం
- సిసిఎల్ఏ వరకు వెళ్లడంతో తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసు
- నోటీసులతో సరిపెడతారా? శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా?

అమరావతి (ఏడీఎన్ఎన్):

ప్రజా సమస్యలను నిర్ణీత వ్యవధిలో పారదర్శకంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల పూర్తిగా నీరుగారిపోతోంది. ప్రజలు తమ బాధలను చెప్పుకోవడానికి గ్రీవెన్స్ వేదికల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారుల తీరు మారడం లేదు. పల్నాడు జిల్లా నరసరావుపేట డివిజన్ లోనే ఏకంగా 85 ఫిర్యాదులు మళ్లీ రీఓపెన్ కావడం ఇందుకు నిదర్శనం. నరసరావుపేట డివిజన్ లో 85 రిఓపెన్ అర్జీలు ఉంటే , గురజాల,సత్తెనపల్లి డివిజన్లలో ఇంకెన్ని ఉన్నాయో ? కింది స్థాయి అధికారుల వద్ద న్యాయం జరగకనే బాధితులు కలెక్టరేట్, ఆర్‌డీఓ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. కానీ పైస్థాయి అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించకుండా తిరిగి పాత అధికారులకే రీఫార్వర్డ్ చేస్తుండటంతో సమస్య ఎక్కడేసిన గొంగళి లాగే ఉంది. కింది స్థాయి సిబ్బంది సరైన కారణాలు చూపకుండానే అర్జీలను 'క్లోజ్' చేస్తుండటంతో బాధితులు విధిలేక మళ్లీ రీఓపెన్ చేయిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 2025 నాటి ఫిర్యాదులు కూడా ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం అధికారుల తీవ్ర బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వాట్సప్ ఆడియో రికార్డింగ్ల ద్వారా వచ్చిన కంప్లయింట్స్ ని కూడా తక్షణమే స్వీకరించి, అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పలు వేదికలపై, కలెక్టర్లు, ఉన్నతాధికారుల కాన్ఫరెన్స్ లలో హెచ్చరికలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో పాలన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సీఎం స్థాయి వ్యక్తి స్వయంగా ఆదేశించినా అమలు కాకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల అనాలోచిత నిర్ణయాలకు ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామ సంఘటనే నిలువెత్తు సాక్ష్యం. వెబ్‌ల్యాండ్ అప్‌డేషన్, భూమి రీసర్వే పేరుతో రెవెన్యూ అధికారులు చేసిన ఘోర తప్పుల వల్ల ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న సుమారు 900 మంది రైతులకు చెందిన 1,300 ఎకరాల ప్రైవేటు జిరాయితీ భూములను ఒక్క కలం పోటుతో సెక్షన్ 22ఏ (నిషేధిత భూముల జాబితా) లో చేర్చేశారు. దీంతో పంట రుణాలు పుట్టక, భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి రైతులు అల్లాడిపోతున్నారు. తమ ఆవేదన చెప్పుకుందామని వెళితే అధికారి ఆఫీసులో అందుబాటులో లేకపోవడంతో రైతులు రోడ్డుపై ధర్నాకు దిగారు. కొచ్చర్ల రైతుల ఆందోళన సోషల్ మీడియాలో వైరల్ కావడం, వ్యవహారం సీసీఎల్ఏ వరకు వెళ్లడంతో పల్నాడు జిల్లా యంత్రాంగంలో చలనం వచ్చింది. జాయింట్ కలెక్టర్ తక్షణమే స్పందించి ఈపూరు తహశీల్దార్ నళినీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయితే, "రైతుల జీవితాలతో చెలగాటమాడిన అధికారులకు కేవలం షోకాజ్ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంటారా? లేక చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటారా?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.అధికారులు తమకు కేటాయించిన ఆఫీస్ నుంచి 15 కిలోమీటర్ల పరిధిలోనే నివాసం ఉండాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా, చాలామంది అధికారులు దీనిని ఖాతరు చేయడం లేదు. దూర ప్రాంతాల నుంచి ఆలస్యంగా రావడం లేదా విధులకు పూర్తిగా గైర్హాజరవడం వల్ల సామాన్య ప్రజలు, రైతులు రోజులు తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.కేవలం నోటీసులతో సరిపెడితే అధికారుల తీరు మారదని, రీఓపెన్ అయిన 85 ఫిర్యాదులపై తక్షణ విచారణ జరిపి, కారణం లేకుండా అర్జీలను క్లోజ్ చేసిన అధికారులతో పాటు రైతులను రోడ్డున పడేసిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థ సరిబాట పడుతుందని బాధితులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నేను ఎక్కడికీ పారిపోలేదు

- ఉదయ కృష్ణా రెడ్డి, నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని వెల్లడి

హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :

రైనీ ఐపీఎస్ ఉదయ కృష్ణా రెడ్డి అదృశ్యం అయ్యారనే ఆరోపణలపై ఆయన స్వయంగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలని స్పష్టం చేశారు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండటం వల్లనే తాను స్వగ్రామమైన ఊళ్లపాలెంకు వచ్చానని వివరించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, న్యాయ, పోలీస్ వ్యవస్థలపై తనకు పూర్తి నమ్మకం ఉందని, అందుకే విచారణకు హాజరవుతున్నానని ఆయన తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున ఎక్కువ విషయాలు మాట్లాడలేకపోతున్నానని, త్వరలోనే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటానని ఉదయ కృష్ణా రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పూర్తి గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన తనకు, తన శాశ్వత చిరునామా అయిన ఊళ్లపాలెంకు ఎలాంటి పోలీస్ నోటీసులు అందలేదని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఉదయ కృష్ణా రెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, తన రూమ్‌లోకి లాక్కెళ్లి వేధింపులకు పాల్పడ్డాడని తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆయన ఆత్మహత్య యత్నం చేశారంటూ ఒక సూసైడ్ నోట్ కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ఆ సూసైడ్ నోట్ కేవలం బూటకమేనన్నే వార్తలు కూడా ప్రచారంలోకి వచ్చాయి. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని భావించినప్పటికీ, ఆయన పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడని, నోటీసులు పంపినప్పటికీ కనిపించకుండా పోయాడని పోలీసులు తెలిపారు. పోలీసుల ఈ వాదనలను ఉదయ కృష్ణా రెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

జూరాల ప్రాజెక్టుకు పోటెత్తుతున్న వరద

జోగుళాంబ గద్వాల(ఏడీఎన్ఎన్) :



తెలుగు రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అంతే స్థాయిలో 30,700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి వస్తున్న ఈ ప్రవాహం కారణంగా దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి నీటి చేరువ క్రమంగా పెరుగుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరివాహక ప్రాంతాల్లో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. భీమా నది నుంచి అదనపు ప్రవాహాలు జూరాలలో కలిసే అవకాశం ఉండటంతో ప్రాజెక్టు నీటిమట్టం మరింత హెచ్చనుంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉధృతి కారణంగా శ్రీశైలం జలాశయ నీటిమట్టం వేగంగా పెరుగుతుందని, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి భారీ ఇన్‌ఫ్లో లు నమోదవుతాయని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

అటవీ విస్తీర్ణం పెంపొందే దిశగా ముందడుగు

నరసరావుపేట (ఏడీఎన్ఎన్):

పల్నాడు జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తీర్ణ పెంపొందే దిశగా మరో కీలక ముందడుగు పడింది. కోటప్పకొండ సమీపంలోని గొనెపూడి కొండ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన భారీ 'సీడ్ బాల్స్ డిస్పర్సల్' కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ సహాయంతో అటవీ ప్రాంతాలు, కొండలపైకి సీడ్ బాల్స్ ను వెదజల్లే విధానాన్ని ఈ సందర్భంగా ప్రారంభించారు. ప్రకృతి మనకు స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారాన్ని అందిస్తోందని, దానికి ప్రతిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు . వాతావరణ మార్పులు, ఎల్‌నీనో ప్రభావం వల్ల వర్షపాతం అస్థిరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షపాతం సమృద్ధిగా ఉండాలంటే పెద్ద ఎత్తున వృక్ష సంపదను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులు, విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

12 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లడమే లక్ష్యం : డిఎఫ్ఓ కృష్ణప్రియ

చేరుకోలేని కొండ ప్రాంతాలు, అటవీ భూముల్లో చెట్లను పెంచేందుకు సీడ్ బాల్స్ విధానం అత్యంత సమర్థవంతంగా ఉపయోగపడుతుందని పల్నాడు జిల్లా ఫారెస్ట్ అధికారి కృష్ణప్రియ తెలిపారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లే మహత్తర లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ప్రజల, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాలో మరిన్ని హరిత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఫారెస్ట్ అధికారి కృష్ణప్రియ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధు, అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు,జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

- బాలుడితో పాటు మరో ఇద్దరు దినసరి కూలీలు మృతి
- మరో 13 మందికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు

విజయనగరం(ఏడీఎన్ఎన్) :

విజయనగరం మండలం చెల్లూరులో అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాలుడితో పాటు మరో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. దైవ దర్శనం కోసం రాయగడ వెళ్లేందుకు మూడు కుటుంబాలకు చెందిన 16 మంది ఒక వ్యాన్‌ను బుక్ చేసుకున్నారు. ప్రయాణం మధ్యలో చెల్లూరు వద్ద వ్యాన్‌ను ఆపిన సమయంలో, విశాఖ వైపు నుంచి అతివేగంతో వచ్చిన లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టి సుమారు 500 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో విశాఖ జిల్లా పద్మనాభం మండలం బొచ్చపేటకు చెందిన చింతపల్లి రాంబాబు అలియాస్ రామునాయుడు, మజ్జి నారాయణరావు, బి.మోహననాయుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణ ఘటనలో మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి కాళ్లు విరిగిపోగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతిచెందిన రాంబాబు, నారాయణరావు పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. బాలుడు మోహననాయుడు తండ్రి రమేష్ కూడా అదే పనులకు వెళ్తున్నారు. వీరంతా దినసరి కూలీలుగా పనిచేస్తూ స్నేహితులుగా మారి, కుటుంబాలతో కలిసి సరదాగా దైవదర్శనానికి బయలుదేరగా ఈ మృత్యువు కబళించింది. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం మహారాజా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు.

కొండా విశ్వేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ జిల్లా(ఏడీఎన్ఎన్)

ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం బీవీఎం, యూఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలోని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ఎంపీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అంశంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు నిరసనలు తెలుపుతుంటే, కేంద్ర ప్రభుత్వం స్పందించక తప్పలేదని తెలిపారు. ఈ క్రమంలో నిరసనలపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విద్యార్థి ఉద్యమాన్ని చులకన చేసేలా, హింసను ప్రేరేపించేలా ఉన్నాయని నాయకులు ఆరోపించారు. ఇలాంటి బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేసిన ఎంపీపై బీజేపీ పార్టీ తక్షణమే చర్యలు తీసుకుని ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థుల పోరాటాన్ని సమర్థించిన ఆయన, ఇప్పుడు విద్యార్థుల ఉద్యమాలపై భిన్నంగా మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీవీఎం ఉమ్మడి రాష్ట్రాల కోఆర్డినేటర్ బట్టు శ్రీధర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధాల నాగరాజ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్, విద్యార్థి నాయకులు జవహర్, సురేందర్, యువ నాయకులు రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో కిడ్నాప్ కలకలం

- కిడ్నాపర్ల చెర నుంచి కాపాడిన పోలీసులు

ఏలూరు జిల్లా(ఏడీఎన్ఎన్)

నూజివీడులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఓ కిడ్నాప్ ఘటన తీవ్ర కలకలం రేపింది. కోయిలగూడెం నుంచి గుంటూరు వెళ్తున్న పొగాకు లోడు వాహనాన్ని నూజివీడులోని ఓ పెట్రోల్ బంకు వద్ద వైసీపీ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా కుమారుడు బషీర్, అతడి అనుచరులు అడ్డుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. తర్వాత పొగాకు వ్యాపారి అభిని, లారీ డ్రైవర్‌ను బలవంతంగా కిడ్నాప్ చేసి గుంటూరులోని ఓ గెస్ట్ హౌస్‌లో నిర్బంధించినట్లు సమాచారం వెలువడింది. బాధితుల కుటుంబ సభ్యుల నుంచి అందిన సమాచారంతో వెంటనే అప్రమత్తమైన నూజివీడు పోలీసులు రంగంలోకి దిగి, కిడ్నాపర్ల చెర నుంచి వ్యాపారిని, డ్రైవర్‌ను సురక్షితంగా రక్షించారు. ఈ ఘటనలో ఇప్పటికే ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, బషీర్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కాగా, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుమారుడు బషీర్‌లను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గుంటూరుకు వెళ్లినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా కిడ్నాప్ సమయంలో ముస్తఫా మాట్లాడినట్లుగా భావిస్తున్న కాల్ డేటాను కూడా పోలీసులు సేకరించినట్లు వార్తలు వస్తున్నాయి.

మ్యాన్‌హోల్లో పడి వ్యక్తి గల్లంతు..

హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో మరోసారి అధికారుల నిర్లక్ష్యం, రక్షణ లోపాలు ప్రజల ప్రాణాల మీదకు తెచ్చాయి. మియాపూర్ పరిధిలోని వైశాలి నగర్‌లో జరిగిన ఒక ప్రమాదంలో మ్యాన్ హోల్లో పడి వ్యక్తి గల్లంతైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. హఫీజ్ పేట్ ప్రేమ నగర్ ప్రాంతానికి చెందిన బాలయ్య (బాధితుడు) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు తెరిచి ఉన్న మ్యాన్ హోల్లో జారిపడ్డాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న మురుగునీటి ఉద్ధృతికి ఆయన ఒక్కసారిగా కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా సిబ్బంది సంయుక్తంగా రంగంలోకి దిగి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మురుగునీటి కాలువలు, డ్రైనేజీ పైప్‌లైన్ల గుండా కొట్టుకుపోయిన బాలయ్య ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. వర్షాకాలంలో ఇలాంటి బహిరంగ మ్యాన్ హోల్స్ ప్రాణాంతకంగా మారుతున్నాయని, జీహెచ్ఎంసీ అధికారుల అలసత్వమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బాలయ్యను సురక్షితంగా వెలికితీయాలని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఎలక్ట్రిక్ బస్సు

- పలువురికి స్వల్ప గాయాలు, ఆసుపత్రికి తరలింపు

జగిత్యాల(ఏడీఎన్ఎన్) :

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు మెట్ పల్లి ప్రాంతానికి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఈ బస్సులో మొత్తం 12 మంది ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించారు. ఈ రోడ్డు ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారికి వైద్యులు తగిన చికిత్స అందించారు. ఎలక్ట్రిక్ బస్సు అదుపుతప్పడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యూఎస్ ఓపెన్ కోసం జకోవిచ్, సబలెంక జోడీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

టెన్నిస్ అభిమానులను అపారంగా ఆకట్టుకునే ఒక ఊహించని సంచలనాత్మక వార్త క్రీడా ప్రపంచంలో వైరల్‌గా మారింది. 24 సార్లు గ్రాండ్ స్లామ్ విజేత, సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్, మహిళల ప్రపంచ నంబర్ వన్ స్టార్ అరీనా సబలెంకా రాబోయే యూఎస్ ఓపెన్ 2026 మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీలో కలిసి బరిలోకి దిగబోతున్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ఇద్దరు సింగిల్స్ సూపర్‌స్టార్లు ఒకే జట్టుగా జతకట్టడం టెన్నిస్ చరిత్రలోనే అత్యంత ఆకర్షణీయమైన ఘట్టంగా నిలవనుంది. యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ విడుదల చేసిన 16 జట్ల జాబితాలో ఈ జోడీ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ గత ఏడాది నుండి మిక్స్‌డ్ డబుల్స్ ను ప్రమోట్ చేయడానికి సరికొత్త ఫార్మాట్‌ను, భారీ ప్రైజ్ మనీని తీసుకొచ్చింది. విజేత జట్టుకు దాదాపు 1 మిలియన్ డాలర్ల నజరానా ప్రకటించడంతో సింగిల్స్ స్టార్ ప్లేయర్లు సైతం ఈ విభాగంపై ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టు నెలాఖరులో ఆర్థర్ ఆషే స్టేడియం వేదికగా జరగనున్న ఈ పోరులో జకోవిచ్-సబలెంకాలతో పాటు ఇగా స్వెటెక్ - కాస్పర్ రూడ్, ఎలెనా రైబాకినా - టేలర్ ఫ్రిట్జ్ వంటి ప్రముఖ జోడీలు పోటీపడనున్నాయి. కోర్టులో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ఈ ఇద్దరు దిగ్గజాలు కలిసి ఆడితే టైటిల్ వేటలో వారిని అడ్డుకోవడం దాదాపు అసాధ్యమని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంచలన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

ఐపీఎల్‌లో బౌండరీల సైజ్ పెంచాల్సిందే

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

భారత క్రికెట్ దిగ్గజం, వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులకు, భారత క్రికెట్ నియంత్రణ మండలికి ఒక ముఖ్యమైన ప్రతిపాదన చేశారు. రాబోయే ఐపీఎల్ సీజన్లలో మైదానాల బౌండరీల పరిమాణాన్ని మరింత పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బౌలర్లకు, బ్యాటర్లకు నడుమ సరైన సమతుల్యత దెబ్బతింటోందని, కేవలం సిక్సర్లు, ఫోర్ల కోసం బౌండరీ రోప్‌లను లోపలికి జరపడం బౌలర్లకు తీరని అన్యాయం చేయడమేనని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై గవాస్కర్ మాట్లాడుతూ.. ఆధునిక టి20 క్రికెట్‌లో భారీ సిక్సర్లు కొట్టడం సర్వసాధారణమైపోయిందని, దానికి తగ్గట్టుగానే మైదానం పరిమాణాన్ని కూడా గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కొన్ని స్టేడియంలలో 60 నుండి 65 మీటర్ల బౌండరీలు మాత్రమే ఉంటున్నాయని, వీటి వల్ల మిస్ టైమ్ అయిన షాట్లు కూడా సులభంగా సిక్సర్లుగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద మైదానాలు ఉన్న చోట కూడా బౌండరీలను 75 నుండి 80 మీటర్ల వరకు పెంచే అవకాశమున్నా లోపలికి కుదించడం సమంజసం కాదన్నారు. మైదానం సైజ్ పెంచడం వల్ల బ్యాటర్లకు మరింత సవాలు ఎదురవుతుందని, అప్పుడే నిజమైన నైపుణ్యంతో ఆడే షాట్లకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే బౌలర్లు కూడా ధైర్యంగా వికెట్లు తీసేందుకు ప్రయత్నిస్తారని, మ్యాచ్‌లు మరింత ఆసక్తికరంగా మారుతాయని విశ్లేషించారు. క్రికెట్ అభిమానులు, మాజీ ఆటగాళ్లు కూడా గవాస్కర్ చేసిన ఈ వ్యాఖ్యలకు మద్దతు తెలుపుతుండటంతో, ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో, క్రీడా వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశమై వైరల్‌గా మారింది.

భారీ ఆఫర్లతో అమెజాన్, ఫ్లిప్ కార్ట్ ఫ్రీడం సేల్స్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ప్రముఖ ఇకామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్ కార్టులు వినియోగదారుల కోసం భారీ సేల్‌ను ప్రకటించి ఆకట్టుకుంటున్నాయి. ఆగస్టు 7 నుండి అమెజాన్ 'గ్రేట్ ఫ్రీడమ్ ఫెస్టివల్' పేరుతో రానున్న ఈ ప్రత్యేక సేల్‌లో అందరికీ కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తోంది. అమెజాన్ ప్రైమ్ మెంబర్లకు మాత్రం 12 గంటల ముందుగానే ఈ సేల్ డీల్స్ అందుబాటులోకి రానున్నాయి. కొనుగోలుదారులను మరింత ఆకర్షించడానికి ఎస్‌బీఐ బ్యాంక్ కార్డ్ లావాదేవీలపై 10 శాతం తక్షణ డిస్కౌంట్‌తో పాటు ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, నోకాస్ట్ ఈఎంఐ సదుపాయాలను సైతం అందిస్తోంది. ఈ భారీ ఫ్రీడమ్ సేల్‌లో స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ యాక్సెసరీలు, స్మార్ట్ టీవీలు, ఇతర గృహోపకరణాలతో పాటు అమెజాన్ డివైజులపై అదిరిపోయే ఆఫర్లు లభించనున్నాయి. వినియోగదారులకు షాపింగ్ అనుభవాన్ని మరింత ఆసక్తికరంగా మార్చేందుకు బ్లాక్‌బస్టర్ డీల్స్, ట్రెండింగ్ డీల్స్, ప్రతిరోజూ రాత్రి 8 గంటల ప్రత్యేక డీల్స్, లిమిటెడ్ టైమ్ ఆఫర్లను తీసుకురాబోతోంది. సేల్‌కు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని ఇప్పటికే తన యాప్, వెబ్‌సైట్ మైక్రోసైట్‌లలో ఉంచిన అమెజాన్, త్వరలోనే మరిన్ని ఉత్పత్తుల ధరలు, ఆఫర్ల వివరాలను అధికారికంగా వెల్లడించనుంది. అమెజాన్ కు పోటీగా ఫ్లిప్ కార్ట్ కూడా తన కస్టమర్ల కోసం ఆగస్టు 8 నుండి ఫ్రీడం సేల్ తీసుకువస్తోంది. ప్లస్, బ్లాక్ సబ్ స్క్రైబర్లకు 24 గంటల ముందే అందుబాటులోకి రానున్నాయి. ఎస్బీఐ క్రెడిట్ కార్డుతో చేసే కొనుగోళ్లపై 10 శాతం రాయితీ వస్తోంది. కొన్ని వస్తువులకు ఈఎంఐ, టాప్ డీల్స్, టిక్ టాక్ వంటి ఆఫర్లున్నాయి. ఫోన్లు, ల్యాప్ టాప్స్, ట్యాబ్లెట్స్, టీవీలపై భారీ ఆఫర్లు ప్రకటించింది.

చరిత్ర సృష్టించిన పారా అథ్లెట్ షర్మిలా ధన్‌కర్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత పారా అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న ఈ క్రీడల్లో మహిళల షాట్‌పుట్ F57 ఈవెంట్‌లో భారత అథ్లెట్ షర్మిలా ధన్‌కర్ అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్ పారా అథ్లెటిక్స్ విభాగంలో భారత్‌కు లభించిన మొట్టమొదటి పసిడి పతకం ఇదే కావడం విశేషం. 40 ఏళ్ల షర్మిలా 9.81 మీటర్ల దూరం ఇనుపగుండును విసిరి సీజన్ బెస్ట్ త్రో నమోదు చేయడమే కాకుండా, పారా అథ్లెటిక్స్ లో పతకం కోసం భారత్ గడిపిన 20 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించారు. రెండు సంవత్సరాల వయస్సులోనే పోలియో కారణంగా

ఎడమ కాలును కోల్పోయినప్పటికీ, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి గతంలో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న ఆమె ఈసారి ఏకంగా పసిడితో దేశ కీర్తిని చాటారు. ఇదే ఈవెంట్‌లో తీవ్ర నాటకీయ పరిణామాల మధ్య భారత్‌కే చెందిన శిల్పా శైల కాంస్య పతకాన్ని సాధించడంతో పారా అథ్లెటిక్స్ విభాగంలో భారత్ డబుల్ ధమాకా నమోదు చేసింది. శిల్ప తన వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనగా 7.26 మీటర్ల దూరం విసిరి మొదట నాలుగో స్థానంలో నిలవగా, కాంస్యం నైజీరియాకు చెందిన యుచారియా ఇయాజీకి దక్కినట్లు అధికారులు ప్రకటించారు. అయితే నైజీరియన్ అథ్లెట్ త్రో నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ భారత బృందం వెంటనే వీడియో రివ్యూ ఆధారంగా అధికారిక అప్పీల్ చేసింది. ఆ విజ్ఞప్తిని పరిశీలించిన నిర్వాహక కమిటీ నైజీరియా అథ్లెట్ త్రోను 'ఫౌల్'గా ప్రకటించడంతో శిల్పా శైల మూడో స్థానానికి చేరి కాంస్య పతక విజేతగా నిలిచారు. ఒకే ఈవెంట్‌లో ఇద్దరు భారత పారా అథ్లెట్లు స్వర్ణ, కాంస్య పతకాలతో మెరవడంతో భారత క్రీడా లోకంలో సంబరాలు మిన్నంటాయి.

శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో జడేజా రీఎంట్రీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

శ్రీలంకతో జరగబోయే ప్రతిష్టాత్మకమైన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌తో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి రావడం అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న భారత జట్టుకు కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ పర్యటనలో తొలి టెస్టు గాలే వేదికగా, రెండో టెస్టు ఆగస్టు 23 నుండి కొలంబోలో జరగనుంది. ఈ జట్టు ఎంపికలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్‌లకు చోటు

దక్కినప్పటికీ, వారు ఆడే విషయం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫిట్‌నెస్ క్లియరెన్స్ పైనే ఆధారపడి ఉంది. గాయం కారణంగా వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోవడంతో ఆల్ రౌండర్ సారాంశ్ జైన్ తొలిసారి జాతీయ జట్టులోకి పిలుపు అందుకుని అందరి దృష్టినీ ఆకర్షించాడు. స్పిన్ విభాగంలో జడేజాతో పాటు కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ కీలక పాత్ర పోషించనుండగా, పేస్ బాధ్యతలను సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ పంచుకోనున్నారు. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో తిరిగి అగ్రస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో టీమిండియా ఈ సిరీస్‌కు సమాయత్తమవుతోంది. టీమిండియా జట్టు: గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్రజడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ, గుర్నూర్ బ్రార్, సారాన్ష్ జైన్, దేవదత్ పడిక్కల్.

ఇన్‌స్టామార్ట్ కొత్త సీఈఓగా నందితా సిన్హా

దూసుకెళ్లిన స్విగ్గీ షేర్లు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ప్రస్తుత సీఈవో అమితేశ్ కుమార్ ఝా రాజీనామా చేశారు. ఆగస్టు 3 నుండి తదుపరి సీఈవోగా నందిత సిన్హా కొనసాగనున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీనితో మంగళవారం స్విగ్గీకి చెందిన క్విక్ కామర్స్ విభాగం ఇన్‌స్టామార్ట్ షేర్లు దూసుకెళ్లాయి. కన్స్యూమర్ ఇంటర్నెట్, రిటైల్ రంగాల్లో 20 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉన్న నందితా సిన్హా రాకతో ఇన్‌స్టామార్ట్ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందనే అంచనాలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. గతంలో మింత్రా సంస్థను లాభాల బాట పట్టించడంతో పాటు మార్కెట్ వాటాను పెంచడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఐఐటీ, ఎఫ్ఎమ్ఎస్ ఢిల్లీ పూర్వ విద్యార్థి అయిన నందితా గతంలో ఫ్లిప్‌కార్ట్, హిందూస్థాన్ యూనీలీవర్, బ్రిటానియా వంటి దిగ్గజ సంస్థల్లో బాధ్యతలు నిర్వర్తించారు. భారత క్విక్ కామర్స్ రంగంలో బ్లింకిట్, జెప్టో, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ వంటి సంస్థల నుంచి తీవ్ర పోటీ ఎదురవుతున్న తరుణంలో, నందిత నాయకత్వం ఇన్‌స్టామార్ట్ లాభదాయకతను, విస్తరణను మరింత వేగవంతం చేస్తుందని స్విగ్గీ గ్రూప్ సీఈఓ శ్రీహర్ష మాజేటి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నాయకత్వ మార్పు వార్త వెలువడిన వెంటనే ఇన్వెస్టర్లు స్విగ్గీ షేర్ల కొనుగోలుకు ఆసక్తి చూపడంతో బిఎస్ఈలో కంపెనీ షేరు భారీగా లాభపడింది. క్విక్ కామర్స్ మార్కెట్లో తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, సమర్థవంతమైన నాయకత్వంతో ఇన్‌స్టామార్ట్ ఆర్థిక పురోగతి సాధిస్తుందన్న నమ్మకంతోనే స్విగ్గీ షేర్లు ఈ స్థాయిలో పుంజుకున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సోషల్ మీడియా దిగ్గజాలకు పార్లమెంటరీ ప్యానెల్ షాక్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, గూగుల్, స్నాప్‌చాట్ వంటి ప్రముఖ సోషల్ మీడియా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు భారత పార్లమెంటరీ కమిటీ షాక్ ఇచ్చింది. సోషల్ అండ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల డేటా భద్రత, పబ్లిక్ ఆర్డర్ నిర్వహణ అంశాలపై సమాధానం చెప్పాల్సిందిగా పార్లమెంటరీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ ఈ దిగ్గజ సంస్థలకు సమన్లు జారీ చేసింది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే ఉన్నత స్థాయి సమావేశానికి హాజరుకావాలని ఆదేశించింది. మహిళలు, పిల్లలు, రైతులు, శ్రామికులు, గ్రామీణ ప్రాంత ప్రజల వ్యక్తిగత డేటా ప్రైవసీకి సంబంధించి ఏ విధమైన రక్షణ చర్యలు తీసుకుంటున్నారో నివేదించాలని ప్యానెల్ స్పష్టం చేసింది. ఇటీవల సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల ద్వారా సమాజంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతుండటం, విద్వేషకరమైన ప్రచారాలు, ఆందోళనల సమీకరణ వేగవంతం కావడంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలోనే ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖతో పాటు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులను కూడా ఈ సమావేశానికి ప్యానెల్ సమన్లు పంపింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన ఒక వీడియోను ఫేస్‌బుక్ సాంకేతిక లోపం పేరిట తాత్కాలికంగా తొలగించడం, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా శాంతిభద్రతల పరిరక్షణకు సవాళ్లు ఎదురవ్వడం వంటి అంశాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా కంపెనీల నియంత్రణకు స్పష్టమైన చట్టపరమైన నిబంధనలు రూపొందించడంతో పాటు అల్గారిథమ్ పారదర్శకతపై ఈ భేటీలో కీలకంగా చర్చించనున్నారు. నిబంధనలు ఉల్లంఘించే ప్లాట్‌ఫామ్‌లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో ఈ పరిణామం టెక్ వర్గాల్లో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది.

జాన్సన్ బేబీ పౌడర్‌కు భారీ జరిమానా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన దిగ్గజ ఫార్మా, హెల్త్ కేర్ సంస్థ 'జాన్సన్ & జాన్సన్'వ్యాపార ప్రపంచంలో సరికొత్త వివాదంతో వార్తల్లో నిలిచింది. కంపెనీకి చెందిన ప్రముఖ 'టాల్కమ్ బేబీ పౌడర్' వాడటం వల్ల క్యాన్సర్ బారిన పడ్డామంటూ దాఖలైన వేలాది కేసులను పరిష్కరించుకోవడానికి సంస్థ ఏకంగా 5.5 బిలియన్ డాలర్ల (భారతీయ కరెన్సీలో దాదాపు రూ. 45,000 కోట్లకు పైగా) భారీ మొత్తాన్ని చెల్లించేందుకు సిద్ధపడినట్లు కథనాలు వెలువడటం అంతర్జాతీయ వ్యాపార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. దశాబ్దాలుగా నడుస్తున్న ఈ న్యాయపోరాటానికి ముగింపు పలికే దిశగా కంపెనీ ముందుకు తెచ్చిన ఈ భారీ సెటిల్‌మెంట్ ప్రణాళిక ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తోంది. జాన్సన్ & జాన్సన్ టాల్కమ్ పౌడర్‌లో క్యాన్సర్‌కు కారణమయ్యే ప్రమాదకరమైన 'ఆస్బెస్టాస్' కణాలు ఉన్నాయని, దానివల్ల ముఖ్యంగా మహిళల్లో అండాశయ క్యాన్సర్ తీవ్రరూపం దాల్చిందని ఆరోపిస్తూ అమెరికా వ్యాప్తంగా పదుల వేల సంఖ్యలో వినియోగదారులు కోర్టులను ఆశ్రయించారు. ఈ సుదీర్ఘ న్యాయ వివాదం కంపెనీ బ్రాండ్ ఇమేజ్‌పైనే కాకుండా, స్టాక్ మార్కెట్ విలువపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది.

దాంతో, ఈ లీగల్ చిక్కుల నుంచి బయటపడటానికి, భవిష్యత్ దావాలకు ముగింపు పలకడానికి సబ్సిడరీ కంపెనీ ద్వారా దివాలా పరిష్కార మార్గాన్ని ఎంచుకుని బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది. బాధితులకు చెల్లించాల్సిన పరిహారం కోసం ఉద్దేశించిన ఈ సెటిల్‌మెంట్ ప్రతిపాదనకు మెజారిటీ బాధితులు, కోర్టు ఆమోదం లభిస్తే గత కొన్నేళ్లుగా కంపెనీని వేధిస్తున్న అతిపెద్ద వివాదానికి శాశ్వత తెరపడనుంది. ఈ వివాదాల నేపథ్యంలో కంపెనీ ఇప్పటికే గ్లోబల్ మార్కెట్లలో టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ విక్రయాలను పూర్తిగా నిలిపివేసి, దాని స్థానంలో సురక్షితమైన కార్న్ స్టార్చ్ ఆధారిత ఉత్పత్తులను విక్రయిస్తోంది. నిత్యం కోట్లాది మంది విశ్వసించే అంతర్జాతీయ బ్రాండ్ ఈ స్థాయి పరిహారం చెల్లించాల్సి రావడం కన్స్యూమర్ మార్కెట్లోనూ, ఇన్వెస్టర్లలోనూ తీవ్ర చర్చకు దారితీసింది.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ ఆభరణాలు కొంటున్నారా ?

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులకు, ముఖ్యంగా చవకైన వెండి, ఫ్యాషన్ ఆభరణాలను అమితంగా ఇష్టపడే వారికి ఒక దిగ్భ్రాంతికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. అందంగా కనిపించే ఈ నగలు కొనుగోలుదారుల ఆరోగ్యాన్ని, ముఖ్యంగా చిన్నపిల్లల ప్రాణాలను తీవ్ర ప్రమాదంలో పడేస్తున్నాయని ఒక తాజా అధ్యయనం స్పష్టం చేసింది. ప్రముఖ బ్రిటిష్ పత్రిక 'ది సండే టైమ్స్' నిర్వహించిన దర్యాప్తులో ఈకామర్స్ ప్లాట్ ఫామ్‌లలో విక్రయిస్తున్న అనేక చవకైన వెండి నగల వెనుక ఉన్న భయానక నిజాలు బయటపడ్డాయి. 925 స్టెర్లింగ్ సిల్వర్ అని ప్రచారం చేస్తూ విక్రయిస్తున్న కొన్ని ఉంగరాలను బర్మింగ్‌హామ్ అస్సే ఆఫీస్ పరీక్షించగా, వాటిలో ఏకంగా 92.3 శాతం క్యాన్సర్ కారక 'కాడ్మియం' ఉన్నట్లు తేలింది. చట్టప్రకారం ఆభరణాలలో ఈ లోహం ఉండాల్సిన గరిష్ఠ పరిమితి కేవలం 0.01 శాతం మాత్రమే కావడం గమనార్హం. అంటే అనుమతించిన స్థాయి కంటే దాదాపు 9,000 రెట్లు ఎక్కువగా కాడ్మియం ఉపయోగించినట్లు నిర్ధారణ అయింది. కేవలం వెండి నగలే కాకుండా సోషల్ మీడియా ప్రకటనలు, రీల్స్ ద్వారా విపరీతమైన క్రేజ్



సంపాదించుకున్న ఫ్యాషన్ చైన్లలో కూడా 33 శాతం కాడ్మియం గుర్తించారు, ఇది కూడా చట్టబద్ధ పరిమితి కంటే 3,300 రెట్లు ఎక్కువ. ఈ దర్యాప్తు వివరాలు బయటకు రావడంతో సంబంధిత ఈకామర్స్ సంస్థలు తక్షణమే ఆయా నగల విక్రయాలను నిలిపివేసి, తమ ప్లాట్ ఫామ్‌ల నుంచి తొలగించాయి. కాడ్మియం అనేది అత్యంత ప్రమాదకరమైన భారీ లోహాలలో ఒకటి అని వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఈ నగలను రోజూ ధరించడం వల్ల ఆ లోహం చర్మం ద్వారా శరీరంలోకి చేరి క్రమంగా పేరుకుపోతుంది. కాలక్రమేణా ఇది కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులను తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా క్యాన్సర్ ముప్పును భారీగా పెంచుతుంది. చిన్నపిల్లలు ఇటువంటి ఆభరణాలను నోట్లో పెట్టుకోవడం లేదా ఎక్కువసేపు వేసుకుని తిరగడం వల్ల ఈ ప్రమాదం మరింత తీవ్ర రూపం దాల్చుతుందని స్పష్టం చేస్తున్నారు. మన దేశంలో కూడా ఆన్‌లైన్ ద్వారా ఫ్యాషన్, వెండి ఆభరణాల కొనుగోళ్ళు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ వినియోగదారులు కూడా అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగారు నగలు కొనేటప్పుడు బీఐఎస్ హాల్‌మార్క్ ఎంత ముఖ్యమో, వెండి లేదా ఫ్యాషన్ నగలు కొనేటప్పుడు కూడా ప్రామాణిక నాణ్యతా పత్రాలు అంతే ముఖ్యం. తక్కువ ధరకు, ఆకర్షణీయమైన డిజైన్లలో వస్తున్నాయి కదా అని నాణ్యతా ధృవీకరణ లేని ఉత్పత్తులను కొనుగోలు చేస్తే దీర్ఘకాలంలో ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. కాబట్టి ఆన్ లైన్‌లో ఆభరణాలు కొనే సమయంలో ధర కంటే నాణ్యత, భద్రతలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వడం శ్రేయస్కరం.

పాకిస్థాన్‌పై శ్రీలంక మహిళల ఘన విజయం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

పాకిస్థాన్ మహిళల జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక జట్టు 2-1 తేడాతో గెలుచుకుంది. హంబన్‌తోట వేదికగా జులై 28న జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో శ్రీలంక మహిళల జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో పాకిస్థాన్ గెలిచినప్పటికీ, ఆ తర్వాత జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ శ్రీలంక మహిళలు అద్భుతంగా పుంజుకుని సిరీస్‌ను కైవసం చేసుకున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ లంక బౌలర్ల ధాటికి 40 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌటైంది. పాక్ ఇన్నింగ్స్ లో ఫాతిమా సనా (41), గుల్ ఫెరోజా (40), మునీబా అలీ (34) మాత్రమే పర్వాలేదనిపించారు. శ్రీలంక బౌలర్లలో కెప్టెన్ చమారీ ఆటపట్టు (3/27), కవిష దిల్హరి (3/27), చేతన విముక్తి (3/36) తలో మూడు వికెట్లు పడగొట్టి పాక్ బ్యాటింగ్ వెన్నుముక విరిచారు. అనంతరం 188 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక కేవలం 37.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా విజయాన్ని అందుకుంది. లంక బ్యాటర్లలో హర్షిత సమరవిక్రమ (71 నాటౌట్), కెప్టెన్ చమారీ ఆటపట్టు (52), హాసిని పెరీరా (50 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. వన్డే సిరీస్ ముగియడంతో, ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జులై 31 నుంచి ప్రారంభం కానుంది.

స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఉడుదుడుకుల మధ్య సాగి చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడిన సూచీలు, సెషన్ ముగిసే సమయానికి ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో ఒత్తిడికి గురయ్యాయి. క్రితం ముగింపుతో పోలిస్తే బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ సుమారు 70 పాయింట్లు నష్టపోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా అదే బాటలో పయనించి కీలక మద్దతు స్థాయి సమీపంలో ముగిసింది. కార్పొరేట్ త్రైమాసిక ఫలితాల వెల్లడి వేళ ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరించడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు రావడం సూచీలపై స్పష్టమైన ప్రభావం చూపింది. ఈ ట్రేడింగ్ సెషన్‌లో ప్రధానంగా బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగానికి చెందిన షేర్లలో విక్రయాల ఒత్తిడి కనిపించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి దిగ్గజ షేర్లు నష్టాల్లో పయనించి సూచీలపై భారాన్ని పెంచాయి. మరోవైపు టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఫార్మా, ఎఫ్ఎమ్‌సిజి, మెటల్ రంగాలు కొనుగోళ్ల మద్దతును పొంది మార్కెట్‌ను కొంతవరకు నిలబెట్టే ప్రయత్నం చేశాయి. సిప్లా, సన్ ఫార్మా, ఐటీసీ, టాటా స్టీల్ వంటి ప్రధాన షేర్లు లాభాల బాటలో పయనించి నష్టాల తీవ్రతను తగ్గించాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఆసియా సూచీలు మిశ్రమంగా ముగియడం, రాబోయే అంతర్జాతీయ కేంద్ర

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
బుధవారం | హైదరాబాద్
29.07.2026
www.manasarkar.com

గాయాన్ని లెక్కచేయని రామ్‌చరణ్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మణికట్టుకు సర్జరీ చేసిన సంగతి తెలిసిందే. అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో సర్జరీ విజయవంతంగా పూర్తయ్యింది. రామ్‌చరణ్‌కి కోయంబత్తూర్లులోని గంగా ఆస్పత్రిలో ఛైర్మన్ డా.ఎస్.రాజశేఖరన్ నేతృత్వంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. అమెరికా నుంచి వచ్చిన వైద్యులు డా.అలెజాండ్రో బాడియా బృందం, డా.ప్రవీణ్ భరద్వాజ్ శస్త్రచికిత్సని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం వైద్యుల సూచనల మేరకు ఆయన పూర్తి విశ్రాంతి తీసుకుంటున్నారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులతో పాటు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ మేరకు 'పెద్ది' చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ కూడా సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేసింది. "ప్రియమైన రాంచరణ్ గారి మణికట్టు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయినందుకు సంతోషంగా ఉంది. మణికట్టు గాయంతో బాధపడుతున్నప్పటికీ, సినిమాలో కీలక సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేయడానికి ఆయన చూపిన పట్టుదల మొత్తం యూనిట్‌కు స్ఫూర్తిగా నిలిచింది. సినిమా పట్ల ఆయనకున్న నిబద్ధత నిజంగా ప్రశంసనీయం. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉంది. త్వరగా పూర్తిగా కోలుకుని మరింత ఉత్సాహంతో అభిమానుల ముందుకు రావాలని కోరుకుంటున్నాం'' అని ట్వీట్లో పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్స సమయంలో ఆయనతో పాటు భార్య ఉపాసన, తల్లిదండ్రులు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కూడా కోయంబత్తూరులోనే ఉన్నారు. ఇటీవల విడుదలైన 'పెద్ది' సినిమాతో రామ్‌చరణ్ ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన తదుపరి ప్రాజెక్టుపై దృష్టి సారిస్తున్నారు. స్టార్ దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు దాదాపు పూర్తయ్యాయి.

'చెన్నై లవ్‌స్టోరీ'కి అమేజింగ్ కలెక్షన్స్

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఆకట్టుకున్నారంటూ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. ప్రశంసలతో పాటు మంచి వసూళ్లు దక్కించుకుంటోంది. ఈ సినిమా 3 రోజుల్లోనే 40.1 కోట్ల రూపాయలు ఆర్జించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ మీట్ ను యువసామ్రాట్ నాగచైతన్య ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు.

గ్రాండ్ సక్సెస్ మీట్ లో యువసామ్రాట్ నాగచైతన్య

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఈ కార్యక్రమంలో హీరో నాగచైతన్య మాట్లాడుతూ ఈ వేదిక మీద మీ అందరి సక్సెస్ సెలబ్రేట్ చేయడం నాకు హ్యాపీగా ఉంది. నాకు పర్సనల్‌గా లవ్ స్టోరీస్ అంటే చాలా ఇష్టం. కోవిడ్ తర్వాత లవ్ స్టోరీస్ తగ్గిపోతుంటే బాధపడ్డాను. లవ్ స్టోరీస్ చూసేందుకు ప్రేక్షకులు థియేటర్స్ కు వెళ్తారా వెళ్లరా అని భయపడ్డాను. మెల్లిగా ఆ ట్రెండ్ మళ్లీ మొదలైంది. ఈ చెన్నై లవ్ స్టోరీతో మరో కల్ట్ లవ్ స్టోరీ ఇండస్ట్రీకి ఇచ్చారు. మనం ఎన్నో విభిన్నమైన ప్రేమ కథలు చూశాం. పెళ్లయ్యాక, లవ్ బ్రేకప్ అయ్యాక వాళ్ల కథలు ఎలా ఉంటాయి అనే సంక్లిష్టమైన బ్యాక్ డ్రాప్‌లు కూడా వస్తున్నాయి. ఈ తరం ప్రేక్షకులు అలాంటి ప్రేమ కథలకే ఎక్కువ కనెక్ట్ అవుతున్నారు. ఒక జంట తమ జీవితంలోని ఎత్తుపల్లాలు, జయాపజయాలు గురించి డిస్కస్ చేసుకునే మూవ్ మెంట్స్ ను ఏ ప్రేమ కథల్లోనూ క్యాప్చర్ చేయడం లేదు. ఆ తరహా స్టోరీస్ రావాలని, ఆ టాపిక్స్ దర్శకులు ఎంచుకోవాలని ఎదురుచూస్తున్నాను. ఒక యాక్టర్ గా అలాంటి ప్రేమ కథలు వస్తే బాగుండును అనుకున్నాను. చెన్నై లవ్ స్టోరీలో నేను కోరుకునే ప్రేమ కథను చూశాను. ఈ సినిమా చూశాక ఎంతో సంతోషించాను. పరిణితితో రాసిన ప్రేమ కథ ఇది. ఇంత మంచి కథ రాసి మరో దర్శకుడికి ఇవ్వడంలోనే సాయి రాజేష్ గొప్పదనం కనిపిస్తోంది. కాంప్లెక్స్ ఎమోషన్స్ ఉన్న ఇలాంటి మెచ్యూర్డ్ లవ్ స్టోరీని రవి నంబూరి చక్కగా తెరకెక్కించాడు. అమ్మ ప్రేమ గురించి కిరణ్ చేసిన సీన్, చెప్పిన డైలాగ్స్ కూడా ఎమోషనల్ అయ్యేలా చేశాయి. అంత బాగా పర్ ఫార్మ్ చేసిన వీళ్లద్దరికి హ్యాట్సాఫ్. వీళ్ల విజయం నాకెంతో స్ఫూర్తినిస్తోంది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేని ఎంతోమంది కొత్త వాళ్లకు కూడా వీళ్ల విజయాలు ఇన్స్పిరేషన్ గా నిలుస్తాయి. ఒక ప్రేమ కథ ఇలాంటి నెంబర్స్ బాక్సాఫీస్ వద్ద కలెక్ట్ చేయడం అద్భుతం. వచ్చే వీకెండ్ కూడా కలెక్షన్స్ చాలా బాగుంటాయి. ఈ విజయానికి కారణమైన ప్రేక్షకులకు థ్యాంక్స్ అన్నారు. ఈ ఈవెంట్ లో దర్శకుడు, నటుడు దేవిప్రసాద్, దర్శకుడు, నటుడు కరుణ కుమార్, లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్, మైత్రీ శశి, డైరెక్టర్ శైలేష్ కొలను, హీరో త్రిగుణ్, సీడెడ్ డిస్ట్రిబ్యూటర్ యతి, ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ, కో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి, ప్రొడ్యూసర్, స్టోరీ రైటర్ సాయి రాజేష్, ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్, హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడారు.

'అబ్జెక్షన్ మై లార్డ్'కు మెగాస్టార్ అభినందన

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

వినూత్నమైన కంటెంట్‌తో అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తూ అందరి హృదయాల్లో తనదైన స్థానాన్ని దక్కించుకున్న మోస్ట్ పాపులర్ ఒటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 నుంచి మరో ఒరిజినల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే 'అబ్జెక్షన్ మై లార్డ్'. శ్రీకాంత్, అనన్య శర్మ, ముఖేష్ రుషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. 'నోటరీ పరశురాం' ట్యాగ్ లైన్. సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వంలో డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల ఈ సిరీస్‌ను రూపొందించారు. 7 ఎపిసోడ్‌స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ ఒరిజినల్ ఈనెల 31 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటీనటులతో పాటు హీరో శ్రీకాంత్, పలువురు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. జీ 5 లో నాది ఇది మూడో వెబ్ సిరీస్. ఈ మూడింటిలో డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయడమే చేశారు. జీతో నాకు మంచి అనుబంధం ఉంది. 3 సిరీస్ లు చేయడంతో పాటు డ్రామా జూనియర్స్ కూడా చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. సినిమాలో కంటే సిరీస్ లోనే కష్టం ఎక్కువగా ఉంది కానీ చాలా ఎంజాయ్ చేస్తూ చేశాము. ఇందులో నాకు మంచి క్యారెక్టర్ దొరికింది. దర్శకుడు ఎంతో మెలకువతో చాలా క్లారిటీతో ఈ సిరీస్ రూపొందించారు. షూటింగ్ సమయంలో నిర్మాత రాజ్‌కుమార్ చాలా సపోర్ట్ చేశారు. ఈ సిరీస్ అవుట్ ఫుట్ చూశాక ఫిదా అయ్యాము. మంచి అవుట్ ఫుట్ వచ్చింది. నటీనటులంతా ఎంతో ఎనర్జీతో షూటింగ్ లో పాల్గొన్నారు. ముఖేష్ గారు యాక్టర్ మాత్రమే కాదు ప్యూర్ హార్ట్ మనిషి. ప్రతి క్యారెక్టర్ లో మంచి ఎలివేషన్ ఉంటుంది. అందరూ బాగా చేశారు. చిరంజీవి గారు కూడా చూసి చాలా బాగుందని చెప్పారు. థాంక్యూ ఆల్ అన్నారు. సిరీస్ ప్రివ్యూ ఈవెంట్ లో ఎడిటర్ కిషోర్, జెమినీ సురేష్, నటి స్నేహాల్, నటి అనన్య, నటుడు సమీర్, నిర్మాత రాజ్‌కుమార్ ఆకెళ్ల, డైరెక్టర్ సంతోష్ అయ్యప్పన్, యాక్టర్ ముఖేష్ రిషి మాట్లాడారు.

చిరునవ్వే చిరునామాగా..

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

- 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47'లో 'స్వర్ణ'గా శ్రీనిధి శెట్టి పరిచయం

విక్టరీ వెంకటేష్ పోషించిన చిట్టిబాబు పాత్ర పరిచయానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిన నేపథ్యంలో, 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చిత్ర బృందం ఈ ఆదర్శ కుటుంబంలోని మరో కీలక సభ్యురాలిని పరిచయం చేసింది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి 'స్వర్ణ' పాత్రలో నటిస్తున్నారు. చిట్టిబాబుకు భార్యగా, చిరునవ్వే చిరునామాగా ఉండే ఓ ఆప్యాయమైన మధ్యతరగతి ఇల్లాలిగా ఆమె పాత్ర ప్రేక్షకుల హృదయాలను హత్తుకోనుంది. చిట్టిబాబు-స్వర్ణల మధ్య ఉండే అనుబంధం, చిలిపి సంభాషణలు, అనురాగం, కుటుంబ విలువలు సినిమాకు మరింత ఆత్మను, ఆహ్లాదాన్ని అందించనున్నాయి. విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్ లో నివేదా పేతురాజ్, ప్రముఖ హాస్యనటుడు సత్య కొన్ని క్షణాలు కనిపిస్తూ చిత్రంలోని వినోదాత్మక వాతావరణాన్ని మరింత ఆసక్తికరంగా మలిచారు. ఇప్పటికే విడుదలైన పాత్ర పరిచయాలు ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించగా, త్వరలోనే యువినా పార్థవిను 'సంపూర్ణ'గా, రాజా ప్రజ్వల్ను 'సర్వ'గా చిత్ర బృందం పరిచయం చేయనుంది. ప్రఖ్యాత హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ వహిస్తున్నారు. థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, రవి.కె. చంద్రన్ ఛాయాగ్రహణం, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రేక్షకులందరికీ హృద్యమైన కుటుంబ వినోదాన్ని అందించనున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చిత్రం 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

1990ల నాటి నేపథ్యంలో..

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎస్.ఎల్.వి సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా 'కింగ్ జాకీ క్వీన్'. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు కె.కెకి ఇది చివరి చిత్రం. ఆయన క్రియేటివిటీ, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావానికి ఇది ఒక నివాళిగా నిలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఈ సినిమాపై మంచి ఆసక్తిని రేకెత్తించాయి. తాజాగా చిత్ర బృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది, ఇది సినిమా నేపథ్యాన్ని, కథాంశాన్ని పరిచయం చేస్తోంది. దావూద్ ఇబ్రహీం, అజ్మల్ కసబ్, మదర్ థెరిసాలతో పోలుస్తూ ప్రధాన పాత్రలను పరిచయం చేసే ఆకట్టుకునే వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పరిస్థితులు ఒక మనిషిని క్రూర మృగంగానో, గొప్ప మహర్షిగానో లేదా సాధారణ మనిషిగానో ఎలా మారుస్తాయో ఇది సూచిస్తుంది, దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా పోషించిన పాత్రలకు బలమైన పునాదిని వేస్తుంది. అధికారం, అహంకారం, ప్రతీకారం చుట్టూ తిరిగే ఉత్కంఠభరితమైన కథని ప్రజెంట్ చేస్తోంది. ఇందులో ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య తలెత్తే తీవ్ర సంఘర్షణ కథను నడిపిస్తుంది.

సీనియర్ నటి పావలా శ్యామల కన్నుమూత

- ఉస్మానియాలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నటి
- వృద్ధాశ్రమానికి పార్థివదేహం... బుధవారం అంత్యక్రియలు

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన నటనతో ఎంతోమందిని నవ్వించిన ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్, సీనియర్ నటి పావలా శ్యామల (75) ఇక లేరు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మంగళవారం తెల్లవారుజామున 1.52 నిమిషాలకు గుండెపోటు రావడంతో మరణించినట్లు ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు.

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

కూతురి దీనస్థితి.. పావలా శ్యామల గత కొన్నేళ్లుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, వృద్ధాప్య సమస్యలతో జీవన పోరాటం సాగిస్తున్నారు. ఆమెతో పాటే ఉన్న ఆమె కుమార్తె కూడా ప్రస్తుతం తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఒకప్పుడు వెండితెరపై నవ్వులు పూయించిన నటి, చివరి రోజుల్లో ఇంతటి దయనీయ స్థితిలో కన్నుమూయడం చిత్ర పరిశ్రమను, అభిమానులను తీవ్రంగా కలచివేస్తోంది. 1951లో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి (గుంటూరు జిల్లా)లో జన్మించిన పావలా శ్యామల అసలు పేరు నేతి శ్యామల. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన ఆమె.. పదో తరగతి వరకు చదువుకున్నారు. నాటక రంగంతో నటనలోకి అడుగుపెట్టి, ఆ తర్వాత సినీ పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకున్నారు. 1985లో 'బాబాయ్ అబ్బాయ్'తో ఇండస్ట్రీలోకి వచ్చిన శ్యామల.. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'స్వర్ణకమలం' సినిమాతో గుర్తింపు పొందారు. కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'ఖడ్గం'లో సహాయ నటి పాత్రలో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఆంధ్రావాలా' లో 'పావలా' అనే పేరుతో చేసిన క్యారెక్టర్ పాపులర్ అవ్వడంతో, ఆమెకు పావలా శ్యామలగా పేరు వచ్చింది. 1984లో చిరంజీవి 'ఛాలెంజ్' సినిమాలో నటించిన పావలా శ్యామల సుమారు 100 వరకు సినిమాల్లో నటించగా చివరగా 2019లో వచ్చిన 'మత్తు వదలరా' చిత్రంలో కనిపించారు. 2014 నుంచి తీవ్ర ఆర్థిక, వృద్ధాప్య సమస్యలతో సతమతమవుతున్న ఆమె ఆపై కూతురితో కలిసి దీన స్థితిలో కాలం వెళ్ల దీశారు. ఈ విషయం పత్రికల ద్వారా తెలుసుకున్న నాటి తెలంగాణ సీఎం తక్షణ సాయం కింద రూ.20 వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటు నెల నెలా ఫించన్ అందేలా చూశారు. కానీ మరలా నాలుగైదేండ్లకే పరిస్థితి మొదటికి రావడంతో సినీ నటులు పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్, దిల్ రాజు వంటి వారు సాయం చేస్తూ వచ్చారు.

వృద్ధాశ్రమానికి పార్థివదేహం... బుధవారం అంత్యక్రియలు

సినీ నటి పావలా శ్యామల మృతితో తెలుగు సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. ఆమె పార్థివ దేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి నుంచి వనస్థలిపురంలో సామాజిక కార్యకర్త శంకర్ నిర్వహిస్తున్న 'రెడీ టూ సర్వ్ ఫౌండేషన్' వృద్ధాశ్రమానికి తరలించారు. అక్కడ ఆమెకు సినీ ప్రముఖులు, అభిమానులు నివాళులర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. పావలా శ్యామల అంత్యక్రియలకు సంబంధించిన పూర్తి బాధ్యతలను మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) స్వీకరించినట్లు నటి కరాటే కళ్యాణి వెల్లడించారు. సినీ కళాకారిణిగా ఆమె అందించిన సేవలకు గాను 'మా' ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై ఆమెకు తుది వీడ్కోలు పలికే అవకాశం ఉంది. దశాబ్దాలుగా తెలుగు సినిమాల్లో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన పావలా శ్యామల ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఇటీవల ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో ఆమె వార్తల్లో నిలిచినా, చివరి వరకు ధైర్యంగా జీవించారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

'ది ప్యారడైజ్' కోసం..

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నాచురల్ స్టార్ నాని హీరోగా ఇప్పుడు నటిస్తున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' అందరికీ తెలిసిందే. తన బ్లాక్ బస్టర్ చిత్రం 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చేస్తున్న ఈ రెండో సినిమా భారీ అంచనాలు సెట్ చేసుకుంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు దాదాపు పూర్తి కావస్తుండగా ఓ క్రేజీ బజ్ ఇప్పుడు దీనిపై వినిపిస్తుంది. ఆల్రెడీ ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉన్న సంగతి తెలిసిందే. అయితే కొన్నాళ్లనుంచి ఆ సాంగ్ ఎవరు చేస్తారు అనేదే ప్రశ్నగా మిగిలింది. కానీ ఇప్పుడు ఫైనల్ గా తమ దసరా బ్యూటీనే లాక్ అయినట్టుగా వినిపిస్తుంది. స్టార్ బ్యూటీ కీర్తి సురేష్ దసరా సినిమాలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ వారి కోసం కీర్తి ఓకే చెప్పినట్టుగా ప్రస్తుతం ఓ రూమర్ వైరల్ గా మారింది. మరి ఇది నిజమైతే మరోసారి వెన్నెల మ్యాజిక్ చేస్తుందో లేదో చూడాలి. ఇక ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా ఎస్.ఎల్. వి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



పెళ్లి పుకార్లు మళ్లీ హాట్ టాపిక్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. వరుస విజయాలతో టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్‌లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ బ్యూటీ... ఇప్పుడు పెళ్లి పుకార్లతో మళ్లీ వార్తల్లో నిలిచింది. గతంలో కూడా సంయుక్త పెళ్లి గురించి వార్తలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. అప్పుడు స్వయంగా స్పందించిన సంయుక్త మీనన్... తన దృష్టి పూర్తిగా కెరీర్‌పైనే ఉందని, ప్రస్తుతం వివాహంపై ఎలాంటి ఆలోచన లేదని స్పష్టం చేసింది. అయితే తాజాగా మళ్లీ ఆమె పెళ్లి గురించి సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. షూటింగ్స్ తో బిజీగా ఉన్న ఈ భామ త్వరలో పెళ్లి పీటలు ఎక్కే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం 30 ఏళ్ల వయసులో ఉన్న సంయుక్త... తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస అవకాశాలతో కెరీర్‌లో అత్యున్నత దశలో ఉంది. వరుస హిట్లతో "గోల్డెన్ లెగ్"గా పేరుతెచ్చుకున్న ఈ హీరోయిన్... దర్శకుల ఫేవరెట్‌గా మారింది. కొంతమంది నెటిజన్లు రష్మిక మందన్నమాదిరిగానే సంయుక్త కూడా పెళ్లి తర్వాత తన కెరీర్‌ను కొనసాగించే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం హీరోయిన్లు పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో కొనసాగడం సాధారణమవుతోంది. ఇప్పటికే సంయుక్త మీనన్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. పెళ్లి పుకార్లపై గతంలో క్లియర్‌గా స్పందించిన సంయుక్త... ఈసారి కూడా తనదైన శైలిలో ఈ వార్తలకు చెక్ పెడుతుందా? లేక నిజంగానే కొత్త జీవితానికి సిద్ధమవుతోందా? అన్నది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం చూస్తుంటే... సంయుక్త మీనన్ కెరీర్ జోరుగా సాగుతోంది.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**